

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.8	26.7
కావలి	37	27
ఆత్మకూరు	39	28
ఉదయగిరి	38	27
కందుకూరు	39	28





హనుమంతుడిపై జానకీరాముడి వైభోగం

తన ఇష్టమైన హనుమంతుడిపై విహరిస్తూ శ్రీరామచంద్రుడు భక్తులకు దర్శనం ఇచ్చారు. నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శుక్రవారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం హోమం, బలిహరణ, ఉత్సవమూర్తులకు అభిషేకాలు, తిరుమంజనం వంటి పూజలు జరిగాయి. సాయంత్రం బ్యాండు కచేరీ, హోమం, బలిహరణలు జరగ్గా భక్తులు తరలివచ్చారు. రాత్రి హనుమంతుడిపై కొలువుదీరిన జానకీరాముడు వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. విశేష పూలంగిసేవ, మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ విద్యుద్దీకరణలతో ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కూచిపూడి భరతనాట్యం, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలకు రామ్‌నగర్ భక్త బృందం, తదితరులు పాల్గొన్నారు.

\- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

కళ్యాణం కమనీయం

మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులో కోదండరాముడి కల్యాణం కనులపండువగా జరిగింది. సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగిన ఈ వేడుకను కనులారా వీక్షించేందుకు భక్తజనం తరలివచ్చింది. ముందుగా ఆలయ సంప్రదాయాలతో మంగళ మేళాలు, వేదమంత్రాలు, రామనామ స్మరణల నడుమ స్వామి, అమ్మ వార్లను వివాహ వేదిక మీద కొలువు దీర్చారు. అనంతరం వివాహఘట్టాన్ని శోభాయమానంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గజవాహనంపై స్వామివారు ఊరేగారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం కోదండరాముడు రథంపై విహరించనున్నారు.

\- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)



బుచ్చిలో కోదండరాముడి వివాహాన్ని జరిపిస్తున్న పండితులు

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నెల్లూరు జిల్లాకు ప్రత్యేక సీజన్ ఎడగారు. దీనినే ముందస్తు ఖరీఫ్ సీజన్ అని కూడా అంటారు. అలాంటి ఈ సీజన్‌లో వ్యవసాయ సాగు, నీరు తదితర అంశాలపై వ్యవసాయ శాఖ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. విత్తనాలు, ఎరువుల విషయంలో రైతులు ఇబ్బందిపడకుండా ఇప్పటికే అన్ని చర్యలు తీసుకుంటు న్నారు. మరో నెలలో ప్రారంభమయ్యే సీజన్‌లో పంటలు సాగుకు రైతులు కూడా పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

\- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



ఎడగారు.. షురూ!

- 3.5 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- వ్యవసాయ శాఖ యాక్షన్‌ప్లాన్ సిద్ధం
- 90 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం
- 94,700 మెట్రిక్ టన్నుల ఎరువులు

జిల్లాలో సోమశిల రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉంది. తాగు, సాగునీటికి సంబంధించిన అంచనాలు ఇప్పటికే తయారయ్యాయి. ఎడగారు సీజన్‌కు సంబంధించి దాదాపు 3.3 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని వ్యవసాయ శాఖ అంచనా. అదేవిధంగా వ్యవసాయ బోర్లు, బావుల పరిధిలో మరో 20 వేల ఎకరాలకు నీరందుతాయి.

● 90 వేల క్వింటాళ్ల విత్తనాలు

ఎడగారు సీజన్‌కు 90వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని అంచనా. అయితే 45 నుంచి 50 శాతం విత్తనాలను రైతులు రైతుల నుంచే సేకరించుకుం టారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతు న్నారు. మిగిలిన 50 శాతం రైతులకు అందుబాటులో విత్తనాలు ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో కేఎన్ఎం 1638 రకం విత్తనాలు 63091 క్వింటాళ్లు, బీపీటీ 2270 రకం 875 క్వింటాళ్లు, కేఎన్ఎం 733 రకం 1394, ఎంటీయూ 1010 రకం 2276, బీపీటీ 5204 రకం 4844, ఆర్ఎన్ఆర్ 15048 రకం 5328, ఎన్ఎల్ఆర్ 34449 రకం 2217, ఎంటీయూ 1271 రకం 2077, ఎన్ఎల్ఆర్ 33892 రకం 1495 క్వింటాళ్లతోపాటు మరికొన్ని రకాల విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. రైతుల అవసరాన్ని బట్టి పక్క రాష్ట్రాల నుంచి కూడా తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ఎలాంటి ఇబ్బందీ లేదు



ఎడగారు సీజన్‌లో అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నాం. రైతుల అవసరాన్ని బట్టి తెలంగాణ నుంచి కూడా విత్తనాలు తీసుకొస్తాం. ఏప్రిల్ 15 నుంచి నారుమళ్లు సిద్ధం చేసుకుని మే 15లోగా నాట్లు వేసుకుంటే మంచిది. ఆగస్టులో పంట చేతికొస్తుంది. అక్టోబరులో రెండో పంటకు సిద్ధం చేసుకోవచ్చు. ఈ లెక్కన ప్రతి నెల రైతులకు అవసరమైన ఎరువులను లెక్కగట్టి అందుబాటులో ఉంచేందుకు అన్ని ప్రణాళికలు రూపొందించాం. కెఎన్ఎం 1638, ఎన్ఎల్ఆర్ 34449, ఎన్ఎల్ఆర్ 3354 (ధాన్యరాశి), ఎన్ఎల్ఆర్ 4024 (శ్వేత, సుగంధ), ఎన్ఎల్ఆర్ 8238 (జింక్ వరి) రకాలను రైతులు సాగుచేసే అవకాశం ఉంది. వీటికి అందుబాటులో ఉంచాలని ఇప్పటికే విత్తన తయారీదారులు, హోల్‌సేల్ వ్యాపారులకు సూచించాము. ఎంటీయూ 1010 రకానికి కూడా మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండటంతో దాన్ని కూడా అందుబాటులో ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

\- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

● 94,700 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం

ఎడగారు సీజన్‌లో జిల్లాకు 94700 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఏప్రిల్ నెలలో 7,512, మేలో 15,723, జూన్‌లో 23,451, జులైలో 18,313, ఆగస్టులో 11,109, సెప్టెంబరులో 18,595 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ లెక్కన యూరియా 38,500, డీఏపీ 10,780, ఎంఓపి 10చ010, కాంప్లెక్స్ 30,796, ఎస్ఎస్‌పి 4620 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది.



పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న మంత్రి ఆనం, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు

విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన
సంఘసంస్కర్త 'పూలే'

- ఆయన బాటలోనే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం
- బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- జ్యోతిబా పూలే జయంతిలో మంత్రి ఆనం

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే అని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొని యాడారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన పూలే జయంతి సభలో మంత్రి పాల్గొని మాట్లాడారు. అంతక ముందు నగరంలోని పూలే దంపతుల విగ్రహాలకు మంత్రితోపాటు కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో మంత్రి మాట్లాడతూ పూలే చూపిన బాటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తూ పేద వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి విద్యను అందించాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. ఆత్మకూరులో బీసీ బాలికల జూనియర్ కళాశాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. బీసీ ప్రొటెక్షన్ యాక్ట్ రూపొందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించేలా బీసీ యువతకు బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. రూ.5.27కోట్లుతో నెల్లూరులో బీసీ భవన్ పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలో 500 మంది బీసీ యువతకు స్వయం ఉపాధి పథకాల కింద రూ.11.4 కోట్ల సబ్సిడీ రుణాల మెగా చెక్కును మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివా సులు, బీసీ సంఘ నాయకులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉత్కంఠకు నేటితో తెర!

- నేడు ఇంటర్ ఫలితాలు విడుదల
- ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్‌లో వెల్లడి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ఇంటర్ విద్యార్థులు ఎదురుచూస్తున్న రోజు రానేవచ్చింది. శనివారం ఉదయం 11 గంటలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఒకేసారి ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నట్లు ఇంటర్‌బోర్డు అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. జిల్లాలో జూనియర్ ఇంటర్‌లో జనరల్ విభాగంలో 26,931, ఒకేషనల్ 1245 మంది కలిపి 28,176 మంది, సీనియర్‌లో



జనరల్ విభాగంలో 23,994, ఒకేషనల్‌కు 1030 మంది కలిపి 25,024 మంది పరీక్షలకు హాజరయ్యా రు. అనంతరం రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి నెల్లూరుకు చేరిన 3.54 లక్షల జవాబు పత్రాలను అత్యంత భద్రత నడుమ మూల్యాంకనాన్ని మార్చి 17వ తేదీ ప్రారం భించారు. నాలుగు విడతలుగా ఏప్రిల్ 4వతేదీ నాటికి స్పాట్‌ను పూర్తి చేశారు. స్పాట్‌లో విధులు నిర్వహించేందుకు అన్ని సబ్జెక్ట్‌లకు కలిపి 1200 మంది అధ్యాపకులను నియమించారు. స్పాట్‌ను పూర్తి చేసి జవాబు పత్రాలను కట్టుదిట్టమైన భద్రతనడుమ విజయవాడలోని ఇంటర్‌బోర్డు కార్యాలయానికి తరలించారు. శనివారం విడుదల కానున్న ఫలితాల్లో విద్యార్థులకు సంబంధించిన మార్కులే విడుదల కానున్నాయి. ఎవరికెన్ని మార్కులు వస్తాయోనని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు సైతం ఎవరికివారు లెక్కలు వేసుకుంటున్నారు. ఈ ఏడాది టెన్త్, ఇంటర్ హాల్‌టికెట్లు విడుదల చేసినట్లుగానే వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఫలితాలు కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు చేసినట్లు ఆర్ఐఓ డాక్టర్ ఎ.శ్రీనివాసులు తెలిపారు. వాట్సప్ నెం.9552300009 ద్వారా లేదా బీఐఈఏపీ అధికారిక వెబ్‌సైట్ resultsbie.ap.gov.in ద్వారా ఫలితాలు చూసుకోవచ్చున్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

వెంకటాచలంలో రైతన్నకు అపారనష్టం

వెంకటాచలం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : గురువారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. మండలంలోని తాటిపర్తిపాళెంలో కల్లాల్లో ఆరబోసిన వందల పుట్ల ధాన్యం తడిసి ముద్దయ్యింది. అంతేగాక ఇస్కపాళెం, ఈదగాలి, పూడిపర్తి గ్రామాల్లోనూ ధాన్యం తడిసిపోయింది. తాము ఎంతో కష్టపడి పండించిన పంట నీటిపాలైందని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అధికారులు తమను అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరుతున్నారు.

● రైతుకు అండగా ఉంటాం : సోమిరెడ్డి

ఇస్కపాళెం, ఈదగాలి, తాటిపర్తిపాళెం, పూడిపర్తి గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షానికి సుమారు 10 వేల పుట్ల ధాన్యం తడిచిపోయిందన్నారు. కష్టాల్లో ఉన్న రైతుకు అండగా ఉంటా మని, జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖాధికారి హరికరుణాకర్‌రెడ్డి, తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమ నాయుడు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, టీడీపీ నేతలు, రైతులు తదితరులు ఉన్నారు.



వెంకటాచలం : కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని బయటకు తీస్తున్న రైతులు

● సీతారామపురం : గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో సీతారామపురంలోని తోట కాలనీ వద్ద రహదారిపై తుమ్మ చెట్టు కూలిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడగా, అధికారులు స్పందించి చెట్టును తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

● లింగసముద్రం : ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షానికి, పిడుగపాటుకు మండలంలో విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది. మూడు ప్రాంతాల్లో పిడుగులు పడగా, జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద, జంగంరెడ్డిపాలెం బస్టాండ్ సమీపంలో చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మొగిలిచెర్ల, వెంగళాపురం గ్రామాల సమీపంలో పిడుగులు పడి మూడు చోట్ల విద్యుత్ స్తంభాలకు చెందిన ఇన్సులేటర్లు పగిలిపోయాయి. దీనికితోడు రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకానికి విద్యుత్ సరఫరా చేసే ట్యూబులేషన్ కేబుళ్ళు కాలిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్, సిబ్బంది యుద్ధప్రాతిపదికన చెట్ల కొమ్మలు తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

21న ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్ష

సీతారామపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 20వ తేదీన నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్షను 21వ తేదీకి వాయిదా వేసినట్లు సీతారామపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ ముజిబుర్ రెహమాన్ శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు మార్పును గమనించి 21వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షకు హాజరుకావాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8962
వెండి కిలో ధర	రూ. 95,400
వెండి ఒక గ్రాము	రూ.98.40

న్యూస్ బాక్స్

గరుడ వాహనంపై సీతారాముల గ్రామోత్సవం



గరుడ వాహనంపై ఊరేగుతున్న సీతారామస్వామివారు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వార్లను గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత నాగారప్పమ్మ ఆలయం నుంచి నైవేద్యాలను ఆలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు పంచిపెట్టారు. అనంతరం నిర్వహించిన గ్రామోత్సవంలో భక్తులు కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే వెంగమాంబపురంలో కల్యాణం, ఆంధ్రా వారిపల్లిలో వసంతోత్సవం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

సంతానలక్ష్మికి విశేష పూజలు

ఉదయగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీ సమీపంలోని సంతానలక్ష్మీ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టి పసుపు, కుంకుమ, గాజులు, పుష్పాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

ఘనంగా హనుమంత సేవ

వింజమూరు: పట్టణంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమంత సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా వసంతోత్సవం

ఉదయగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణవీధిలో ఉన్న కోదండ రామస్వామి ఆలయంలో ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా చివరిరోజు వసంతోత్సవం వైభవంగా చేపట్టారు. యువకుల కేరింతల నడుమ ఉట్టి మహోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక వాహనంలో ఉంచి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

ఉదయగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పటంలోని 51 బూత్‌లో శుక్రవారం కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వ కార్డులు, ట్యాగ్‌లను మాజీ మండల టీడీపీ కన్వీనర్ బొజ్జా నరసింహులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా చిననరసిం హులు, అన్నపూర్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 471 బేళ్లను తీసుకొని రాగా 15 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 323 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 148 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 230 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన

సంగం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధీపురం, తిరుమనతిప్ప అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ తల్లులు పాల్గొన్నారు.

● వింజమూరు: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా బీసీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ పద్మజా కుమారి అధ్యక్షతన తల్లుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో పద్మజకుమారి పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆమెవెంట సూపర్‌వైజర్ సుజాత, ఆశా వర్కర్లు శారద, మౌనిక, సంపత్, లక్ష్మీ, రాధా, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సంగం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధీపురం పంచాయతీ వద్ద సర్పంచు బండ్ల ప్రసూన, సాగునీటి సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, క్షేత్రసహాయకుడు డి శ్రీధర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు .. పర్యావరణానికి ముప్పు

● ఆకతాయి చర్యలతో అనర్థాలు ● వేసవిలో అధికంగా అగ్నిప్రమాదాలు ● రూపుకోల్పోతున్న వెలుగొండ అడవులు



దగ్ధమవుతున్న అడవి



మంటలను అదుపు చేస్తున్న అటవీ సిబ్బంది (ఫైల్)

ఉదయగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం వచ్చిందంటే అడవుల్లో ఏదో ఒకచోట అగ్నికీలలు ఎగిసి పడుతుంటాయి. దీంతో విలువైన వృక్ష సంపద అగ్నికి ఆహుతి కావడంతోపాటు వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. దీంతో పర్యావరణానికి పెను ముప్పు తలెత్తుతోంది. జిల్లాలో 2.29 లక్షల హెక్టార్లు అటవీ విస్తర్ణం ఉంది. ప్రధానంగా ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు, వెంకటగిరి అటవీ శాఖ కార్యాలయాల పరిధిలో వెలుగొండ అడవులు బాగా విస్తరించి ఉన్నాయి. ఆయా ప్రాంతాల అడవుల్లో విలువైన ఎర్రచందనం వృక్షాలతోపాటు పులులు, చిరుత పులులు, దుప్పిలు, జింకలు, నెమళ్లు తదితర అనేక రకాల వన్యప్రాణులు ఉన్నాయి. ఏటా వేసవి కావడం, చెట్లు ఆకురాల్చే కాలం కావడంతో కొండలు, గుట్టలపై ఉండే చిట్టడవులతోపాటు గడ్డి మైదానాలు ఎండిపోతాయి. వాటిని కొంతమంది ఆకతాయిలు, మూగజీవాల కాపర్లు గడ్డి పెంపకం కోసం నిప్పు పెట్టడంతో విలువైన వృక్షాలు దగ్ధమవడంతోపాటు వన్యప్రాణాలకు ప్రాణహాని కలగనుంది. దీంతోపాటు తేనే సేకరణం కోసం అడవులకు వెళ్లిన వారు సైతం చెట్లకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి అడవులకు ముప్పు వాటిల్లుతోంది. రోజురోజుకు పచ్చదనం తగ్గుముఖం పట్టడంతో అడవుల విస్తీర్ణం తగ్గుతోంది. ఫలితంగా ప్రకృతి విపత్తులు దాడి చేస్తున్నాయి.

జనావాసాల్లోకి వన్యప్రాణులు

ఎండ వేడిమికి, అగ్నిజ్వాలలకు అటవీ ప్రాంతంలో మేత, నీరు కరువై వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి. వాటిని చూసి వీధికుక్కలు దాడి చేస్తుండడంతో కొన్ని మృత్యువాత పడుతుండగా, మరికొన్ని గాయాలపాలవుతున్నాయి. గాయాలైన వాటిని అటవీ సిబ్బంది చికిత్స అందించి మరలా అటవీ ప్రాంతంలో వదులుతున్నారు. మరికొన్ని వేటగాళ్ల ఉచ్చులో పడి మృత్యువాత పడుతున్నాయి. ఉదయగిరి పట్టణంలో చీకటిపడితే అడవి పందులు సంచరిస్తుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. అధికారులు అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల కోసం తాగునీటి తొట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

- మహబూబ్‌బాషా, జిల్లా అటవీ శాఖాధికారి

అడవుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత. అడవులు అగ్నికి ఆహుతి కాకుండా కాపాడాలని జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్ బాషా అన్నారు. వేసవి దృష్ట్యా అడవులు అగ్నికి ఆహుతి కాకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతోపాటు ఇప్పటికే జిల్లాలోని అన్ని గ్రామాల్లో కళాజాత బృందం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాం. అడవులు దగ్ధమైన ఘటనలను శాటిలైట్ ద్వారా సమాచారం అందిన వెంటనే తమ సిబ్బందిని పంపి మంటలను అదుపు చేస్తున్నామన్నారు.

వాడవాడలా జ్యోతిబా ఫూలే జయంతి వేడుకలు



సంగం: జ్యోతిబా ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అధికారులు



ఉదయగిరి: జ్యోతిబా ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



వింజమూరు: జ్యోతిబా ఫూలే చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న టీడీపీ నాయకులు

సంగం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవానీ, ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారి రాజ్యలక్ష్మి, ఎంపీడీవో షాలెట్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ఉదయగిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లలో శుక్రవారం మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీవో అప్పాజీ, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది హనుమంతరావు, ప్రశాంత్, సమద్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరు: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో జ్యోతిబా ఫూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా టీడీపీ కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

●ఏఎస్ పేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జ్యోతిబా ఫూలే జయంతి వేడుకలను ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వివేక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● కలువాయి : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం జ్యోతిబా ఫూలే చిత్రపటానికి తహసీల్దారు శ్యామ్‌సుందరరాజు పూలమాల వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వర్లు, వీఆర్వోలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

●అనంతసాగరం : స్థానిక ఎంపీడీవో కార్యాలయం, చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

● సీతారామపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం జ్యోతిబా ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల టీడీపీ కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, ఎస్సీ సెల్ కార్యనిర్వాహక అధికార ప్రతినిధి జాషు వా, ఎలిషా కుమార్, సింగాల నాగేశ్వరరావు, కొండయ్య, సీనియర్ అసిస్టెంట్ ఖలీల్, సర్పంచ్ దుర్గాప్రసాద్, పాల్గొన్నారు.

● వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : మండలంలోని వరికుంటపాడు, గొల్లపల్లి ఎస్టీ కాలనీల్లో జ్యోతిబా ఫూలే జయంతి వేడుకలను నిర్వహించారు. వరికుంటపాడు బహుజన వేదిక ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విరువూరులో పోస్టుమెన్‌గా విధులు నిర్వహిస్తున్న కందుల ప్రసాద్ విరువూరు ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మట్టి హరి నారాయణ, నల్లగొర్ల మాల్యాద్రి, బహుజన వేదిక నాయకులు చెంచల ఓబయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైభవంగా సంగమేశ్వరుడికి రావణసేవ



సంగం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు సంగమేశ్వరస్వామి రావణసేవ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ కామాక్షీదేవి, సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను రావణ వాహనంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి బోగనాథం శివప్రసాద్, శ్రీదేవి, శ్రీరాం హజరత్తయ్య, వసంతమ్మ, శ్రీరాం మస్తానయ్య, వెంకట సుజాత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. శనివారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఉభయకర్తలు కోటు దయాకర్‌రెడ్డి, వెంకట కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఎం ఆందోళన



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం శ్రేణులు

ఉదయగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సిలిండర్, పొయ్యి ఏర్పాటుచేసి శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో గ్యాస్, పెట్రోల్, డీజల్ ధరలు తగ్గిస్తామని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. వాటి ధరలను విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేసి ధరలను నియంత్రించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు బండి ప్రసాద్, కాకు కల్యాణి, వెంకటసుబ్బారెడ్డి, ఫజిల్ పాల్గొన్నారు.

కమనీయం... కోదండరాముడి కల్యాణం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వింజమూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండెమడకల గ్రామంలో శుక్రవారం కోదండ రామస్వామి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. నేత్రపర్వంగా రథోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు జరిపించారు. ఆలయ ధర్మకర్త చీమల వెంకటరత్నారెడ్డి, వరమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహ రించారు. కళ్యాణం అనంతరం మధ్యాహ్నం స్వామివారి గ్రామోత్సం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకట్‌నారాయణ, వింజమూరు ఎస్ఐ వీరప్రతాప్, కలిగిరి ఏఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికుల ధర్నా



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఉదయగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట శుక్రవారం ఎన్ఎంయూ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్మికులపై వేధింపులు ఆపాలని, నైట్ అలవెన్స్‌లు రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు నాగరాజు శివశంకర్, సలాం, కాశీవిశ్వనాథ్, ఫణికుమార్, రాములు, కొండయ్య, బాషా, నాగేశ్వరరావు, సురేష్‌బాబు, శివ, సూర్య, నారాయణ, విజయకుమార్, రఫీ, మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

పెన్నానదిలో పడి యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజేష్

సంగం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్నానదిలో పడి నెల్లూరుకు చెందిన నక్కల బుజ్జిబాబు (31) అనే యువకుడు మృతి చెందాడు. శుక్రవారం ఉదయం పెన్నానది నీటిపై మృతదేహం తేలాడుతుండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని గట్టుకు చేర్చి పరిశీలించగా సంగమేశ్వరస్వామి తిరునాళ్లకు వచ్చిన నక్కల కులస్థుడు బుజ్జిబాబుగా గుర్తించారు. బ్రహ్మోత్సవాల్లో క్యాప్‌బాల్‌లు విక్రయించుకునేందుకు బుజ్జిబాబు బంధువులతో కలిసి వచ్చినట్లు తెలిసింది. ఈక్రమంలో గురువారం సాయంత్రం మద్యం మత్తులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు పెన్నానదిలో పడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులతోపాటు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈమేరకు సంగం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

పిడుగు పాటుకు తాటిచెట్టు దగ్ధం

అనంతసాగరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సోమశిలలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పంచాయతీ కార్యాలయం సమీపంలో తాటిచెట్టుపై పిడుగు పడడంతో దగ్ధమైంది. ఈఘటనతో స్థానికులు భయాందోళన చెందారు.

పేద విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ

కలువాయి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులకు మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం పాదరక్షలు పంపిణీ చేశారు. స్వగ్రామం కుల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పాదరక్షలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో ఎన్‌హెచ్‌ఎం విప్లవం

● జిల్లాకు ఏటా రూ.25 కోట్ల రాక
● వ్యాధుల నియంత్రణలో ఈ నిధులే కీలకం
● ఆశా కార్యకర్తల నియామకంతో వైద్యసేవలు విస్తృతం

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఓ విప్లవంలా ఉన్న జాతీయ హెల్త్ మిషన్ (ఎన్ఎహెచ్ఎం) పథకం అమలై శనివారంనాటికి 20 ఏళ్లు పూర్తయ్యాయి. 2005 ఏప్రిల్ 12వ తేదీన కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ కార్యక్రమాన్ని మొదట జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్ఆర్‌హెచ్ఎం)గా పిలిచేవారు. దీనిని 2013లో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం)గా పేరు మార్చిఅమలు చేస్తోంది. దీనిద్వారా అనేక వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి తద్వారా నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో సుఖ ప్రసవాలు నుంచి మాతా, శిశు మరణాల నివారణ వంటి ప్రాధాన్యత రంగాలపై కీలక పాత్ర పోషిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో ఎన్‌హెచ్ఎం వైద్య సేవలకు ఎంతో గుర్తింపు వస్తోంది. ఎన్‌హెచ్ఎం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలోని ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితోపాటు ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. కేంద్రం తన వాటా కింద 60 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు విడుదల చేయాల్సి ఉంది.

● జిల్లాకు ఏటా రూ.25 కోట్లు

ఎన్‌హెచ్ఎం పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం జిల్లాకు ఏటా రూ. 25 కోట్లు విడుదల చేస్తుంది. ఈ నిధులతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలతోపాటు వైద్య ఉద్యోగుల జీతభత్యాలు అందిస్తున్నారు. జిల్లాలోని 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఒక్కోదానికి ఏడాదికి రూ.1.75 లక్షల, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలకు రూ.5 లక్షల, 2 ఏరియా ఆసుపత్రులు, ఒక జిల్లా ఆసుపత్రికి రూ.10లక్షల వంతున ఎన్‌హెచ్ఎం నిధులు విడుదల చేస్తుంది. దీంతో పాటు 659 సచివాలయాలకు శానిటేషన్ నిధుల కింద రూ. 10వేలు చొప్పున రూ.65.90 లక్షలను కేటాయిస్తుంది. జనారోగ్య సమితి కింద 497 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు రూ.10వేల వంతున రూ.49.70 లక్షల కేటాయిస్తుంది. ఈ నిధులతో ఆయా ఆసుపత్రులలో పలు అభివృద్ధి పనులతోపాటు అత్యవసర మందులు కొనుగోలు చేసే వీలుంటుంది.

● 2025లో లక్ష్యాలు..

2025లో ఎన్‌హెచ్ఎం లక్ష్యాలును నిర్ధేశించింది. శిశు, తల్లి మరణాల రేటు తగ్గించాలి. స్త్రీ ఆరోగ్యం, శిశు ఆరోగ్యం, నీరు, పారిశుద్ధ్యం, రోగ నిరోధకాలు, పోషక విలువలు వంటి సేవలు అందించాలి. స్థానికంగా వచ్చే రోగాలతోపాటు అంటువ్యాధుల వ్యాప్తిని నిరోధించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను విస్తృత అందించాలి. అలాగే జనాభా నియంత్రణతోపాటు లింగ సమతుల్యత పాటించాలి. ప్రసూతి మరణాలు 113 నుంచి 90కి తగ్గించాలి. శిశు మరణాలను 32 నుంచి 23కు తగ్గించాలి. స్థూల సంతానోత్పత్తి రేటును 2.1 శాతానికి చేరువచేయాలి. జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్థుల సంఖ్యను 10వేల జనాభాలో ఒకరికి మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలి. మలేరియా వ్యాధిని కూడా వేయి మందిలో ఒకరికి మాత్రమే ఉండేలా తగ్గించాలి. అంటు వ్యాధుల కారణంగా మరణాలు లేకుండా చూడాలి.

ఎన్‌హెచ్ఎం నుంచి వచ్చే మార్గదర్శకాలే కీలకం

ఎన్‌హెచ్ఎం సూచనల మేరకు వైద్య ఆరోగ్య కార్యక్రమాలు అమలు చేస్తున్నాము. ఎన్‌హెచ్ఎం అందిస్తున్న నిధులకు అనుగుణంగా వైద్య ఆరోగ్యశాఖలో అనేక సంస్కరణలు తీసుకు వస్తున్నాం. ఎన్‌హెచ్ఎం 20 ఏళ్ల పూర్తి చేసుకోవాడం ఆనందంగా ఉంది.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

కావలిలో మరో ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం

రూ.2కోట్ల వరకు వసూలు చేసిన కలిగిరివాసి

రీపేమెంట్ ఆగడంతో బాధితుల లబోదిబో

న్యాయం చేయాలన్నా పట్టించుకోని పోలీసులు

కావలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేసిన షేక్ మహబూబ్ సుభానీ ఉదంతం మరవక ముందే మరో మోసం వెలుగులోకి వచ్చింది. ట్రేడ్ మార్కెటింగ్‌లో పెట్టుబడుల పేరుతో ప్రజల నుంచి నగదు వసూలు చేసి ఓ వ్యక్తి పరారయ్యాడు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించినా వారు పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యేను కలిసే యత్నంలో ఉన్నారు.

కలిగిరి మండలానికి చెందిన ఒక వ్యక్తి కావలి పాతూరు శివాలయం సమీపంలో ఉంటూ నాలుగేళ్లుగా ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో షేర్ మార్కెటింగ్ చేస్తున్నట్లు అందరితో నమ్మబలికాడు. తొలుత రూ.50 వేలు వంతున ప్రజల నుంచి వసూలు చేసి, వారికి నెలకు రూ.7 వేల వరకు చెల్లిస్తూ నమ్మకం ఏర్పరుచుకున్నారు. ఒకరి నుంచి మరొకరికి అలా వ్యాపించి మానస హాల్‌సెంటర్ ప్రాంతవాసుల నుంచే సుమారు రూ.2 కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. కొంతకాలం వరకు రూ.లక్షకు రూ.14 వేలు దాకా ఇస్తూ వచ్చిన సదరు వ్యక్తి ఆ తర్వాత మార్కెట్ తగ్గిందని చెప్పి రూ.10 వేలు ఇస్తూ వచ్చారు. దీంతో చిరుద్యోగులు, వ్యాపారులు తమ దగ్గర ఉన్న డబ్బులే కాకుండా బంగారం కుదవపెట్టి మరీ ఇచ్చినట్లు బాధితులు ఆవేదన చెందుతున్నారు. మార్చి నుంచి రీపేమెంట్ చేయకపోగా ఫోన్ ఎత్తకపోవడంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది. ఇంటికి కూడా తాళం వేసి ఉండటంతో ఒకటోపట్టణ స్టేషన్‌కు వెళ్లి తమ గోడు చెప్పుకోగా కోర్టుకువెళ్లి తేల్చుకోండంటూ పోలీసులు ఉచిత సలహా ఇచ్చారని పేర్కొన్నారు. ఆ తర్వాత సదరు వ్యక్తి ఇంటికి వెళ్లగా ఆయన భార్య తమ వద్ద డబ్బుల్లేవటూఊ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని వాపోతున్నారు. దీంతో బాదితులంతా త్వరలో కావలి ఎమ్మెల్యే కృష్ణాఆరెడ్డిని కలిసే ప్రయత్నంలో ఉన్నారు.

కౌన్సిల్, బడ్జెట్ సమావేశాల్లో రూ.7.22 లక్షల భోజనం తిన్నారా!?

● కాంట్రాక్టర్ లెక్కల్లో చేతివాటం ఎంతో!?

నెల్లూరు (సిటీ), ఏప్రిల్ 11, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజాధనం దోచుకోవడం అధికారులు, నాయకులే కాకుండా కాంట్రాక్టర్లకూ ఆనవాయితీగా మారింది. వారం రోజుల వ్యవధిలో ఇటీవల కౌన్సిల్ సమావేశం, బడ్జెట్ సమావేశాలు జరిగాయి. ఇందులో కార్పొరేటర్లు, అధికారులు, ఇతరులకు భోజనం పెట్టినట్లు ఏకంగా రూ.7.22 లక్షలకు లెక్కగట్టారు. ఈ మొత్తాన్ని డ్రా చేసేందుకు బిల్లులు సిద్ధం చేసి సంబంధిత విభాగాలకు పంపారు. ఇందులో చూపిన లెక్కలు ఔరా.. అనిపిస్తున్నాయి.

మటన్ బిర్యానీ, చికెన్ పీస్, రోటీ, కర్రీ, వైట్‌రైస్, సాంబారు, రసం, పెరుగుతోపాటు ఐస్‌క్రీం, అరటిపండు, కిళ్లీ కలిగిన ప్లేటు భోజనాన్ని క్యాటరింగ్ నిర్వాహకులు రూ.350లకు అందిస్తున్నారు. కానీ ఇదే ప్లేటు భోజనానికి రూ.560 ఖర్చయినట్లు, వెయ్యి మందికి భోజనం పెట్టినట్లు సదరు కాంట్రాక్టరు బిల్లులు సిద్ధం చేశారు. ఈ లెక్కన కౌన్సిల్ సమావేశానికి రూ.2.8 లక్షలు, రెండుసార్లు స్నాక్స్ ఇచ్చినందుకు రూ.81 వేలు ఖర్చయినట్లు చూపారు. ఇదే ఖర్చును బడ్జెట్ సమావేశంలోనూ చూపి మొత్తంగా రూ.7.22 లక్షలు భోజనానికి ఖర్చుపెట్టినట్లు బిల్లులు తయారు చేసి విభాగాలకు పంపారు. 54 మంది కార్పొరేటర్లు వారికి సహాయకులుగా మరో 54 మంది, అధికారులు, ఉద్యోగులు 100 మంది వరకు ఉన్నారు. ఇక మీడియా ప్రతినిధులు 30 మంది ఉన్నారు. ఈ లెక్కన 238 మంది (మొత్తం 476) చొప్పున హాజరైన కౌన్సిల్, బడ్జెట్ సమావేశాలకు వెయ్యి మందికి లెక్కగట్టడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వాస్తవానికి దూరంగా రూపొందించిన బిల్లులను ఏమాత్రం ప్రాథమిక తనిఖీ కూడా చేయని అధికారులు చకచక నిధులు మంజూరు చేసేందుకు సిద్ధమయ్యారు. నేడో, రేపో బిల్లుల సొమ్మును కాంట్రాక్టరు ఖాతాలో జమ చేయనున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	111
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	222

కోడిగుడ్ల ధర (100): 420

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కావలి రూరల్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగంగా ఉంటామని ఎమ్పీడీవో శ్రీదేవి తెలిపారు. శుక్రవారం మన్నంగిదిన్నె పంచాయతీలోని చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. చెత్తను రోడ్లపై వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేయాలని చెత్త సేకరణకు ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లు, గ్రామస్థులకు సూచించారు. అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి చెత్త బుట్టలను స్థానికులకు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సమద్, పంచాయతీ కార్యదర్శి గీత, గ్రీన్ అంబాజిడర్లు పాల్గొన్నారు.


సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్పీడీవో

న్యూస్ బాక్స్

21న ప్రవేశ పరీక్ష

లింగసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఏపి మోడల్ స్కూల్‌లో ఈనెల 20వ తేదీ జరగాల్సిన 6వ తరగతి ప్రవేశ పరీక్ష 21వ తేదీకి మార్పు చేసినట్లు ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్తార్ శుక్రవారం తెలిపారు. 20వ తేదీ ఈస్టర్ పర్వదినం సందర్భంగా పరీక్షను 21వ తేదీకి మార్పు చేశారని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్ల, లింగసముద్రం, చినపవని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కందుకూరు రూరల్ ఏడీఈ విజయ్‌బాబు, మండల విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్‌లు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా సబ్‌స్టేషన్‌లలో మెయింటెనెన్స్ పనులు చేయడం, అలాగే వాటి పరిధిలోని గ్రామాలలోని విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలు కొట్టడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించాలని వారు కోరారు.

● కలిగిరి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అందుకు ప్రజలు సహకరించాలని ఏఈ దినేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● కావలి రూరల్, (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంత రాయం ఏర్పడుతుందని ట్రాన్స్ కో రూరల్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, లైన్ల కింద చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

కావలి రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్ర జ్యోతి): పాలిటెక్నిక్ విద్యతో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్ ప్రియ తెలిపారు. పట్టణంలోని విశ్వోదయ బాలికల పాఠశాలలో జరుగుతున్న పాలిసెట్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఇటీవల రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌శాఖకు జాతీయ ప్రమాణాల గుర్తింపు లభించిందన్నారు. అనంతరం విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు.

6వ తరగతి ప్రవేశ పరీక్ష 21వ తేదీకి వాయిదా

కందుకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ మేకపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షలు వాయిదా పడినట్లు ప్రిన్సిపాల్ దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదీన జరగాల్సిన పరీక్ష ఈస్టర్ పండుగ సందర్భంగా 21కి వాయిదా వేసినట్లు తెలిపారు.

'వంచన' పుస్తకం ఆవిష్కరణ

కావలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): 2019-24లో జరిగిన వైసీపీ పాలన వివరిస్తూ స్పెక్ట్రమ్ పబ్లిషర్స్ అధినేత మోహన్ నాయుడు ఆధ్వర్యంలో సామాజికవేత్త, పాత్రికేయుడు డాక్టర్ ఉదయ్‌కుమార్ రచించిన వంచిన పుస్తకాన్ని శుక్రవారం కావలి టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, తిరువీధి ప్రసాద్ పాల్గొన్నారు.

కిలో పొగాకు రూ.280

కలిగిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు మొత్తం 414పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10కంపెనీ ప్రతినిధులు పాల్గొని 361బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-28, ఆర్‌ఆర్-6, సీఆర్-13, జంపింగ్‌లాట్స్-6 కారణాలతో 53బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.260.74గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

ఆధార్ కార్డులపై నేడు స్పెషల్ డ్రైవ్

కొండాపురం, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులేని చిన్నారులకు మండలకేంద్రంలో ప్రత్యే కంగా ఆధార్ కార్డులు తీసేందుకు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు శుక్రవారం ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుండి మండల పరిషత్ కార్యాలయంలో ఆధార్ కార్డులు తీస్తామన్నారు. తల్లిదండ్రుల ఆధార్ కార్డులతో పాటు రేషన్ కార్డు తీసుకొని ఇప్పటివరకు ఆధార్ కార్డు లేని చిన్నారులను కార్యాలయానికి తీసుకొచ్చి కార్డులు పొందవచ్చన్నారు.


కావలి: పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి


అల్లూరు: జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు


ఉలవపాడు: నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ డీఈవో నరసింహరావు, ఉపాధ్యాయులు

సామాజిక ఉద్యమాల చైతన్య దీప్తి పూలే..

- ఎమ్మెల్యే కృష్ణారెడ్డి
- ఘనంగా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు
- బీసీ ఐక్యత భవన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

కావలిటౌన్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి) సామాజిక ఉద్యమాల చైతన్య దీప్తి మహాత్మ జ్యోతిబా పూలే అని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జయంతి పురస్కరించుకుని మాగుంట పార్వతమ్మ రోడ్డు ఆర్టీసీ కూడలిలోని పూలే విగ్రహం వద్ద పలు పార్టీలు, సంఘాల నాయకులు నివాళులర్పించారు. టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సామాజిక వివక్షలపై అలుపెరుగని పోరాటం, మహిళా విద్యకు విశేష కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు పొట్లూరి శ్రీనివాసులు, బాలగురుస్వామి, ఉప్పాల శ్రీనివాసులు, గుండ్లపల్లి రమణయ్య, పల్లపు కుమార్, కావేటి కోటయ్య, దేవరాల సురేష్, పార్టీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబురావు, ఏగూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● జనసేన ఆధ్వర్యంలో..

జనసేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ పాల్గొని కార్యకర్తలతో కలసి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి పూలే అందించిన సేవలను సేవలను కొనియాడారు.

● బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు భరత్‌కుమార్, సీనియర్ నాయకులు జీఎస్టీ బోర్డు గ్రీవెన్స్ సభ్యులు అమరా సుబ్బారావు, సీవీసీ సత్యం, బెల్లంకొండ మాల్యాద్రి, వాయుగండ్ల సుధీర్ పాల్గొన్నారు.

● బీసీ ఐక్యత భవన్ ఆధ్వర్యంలో మెగా రక్తదానం

బీసీ ఐక్యత భవన్ ఆధ్వర్యంలో పలు బీసీ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భవన్ అధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి ప్రసాద్, గోవిందు, బ్రహ్మయ్య, ఖాదర్‌బాష పాల్గొన్నారు.

● కలిగిరి (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మాహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రత్యూష, వెలుగోటి మధు, దీక్షితులు, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కందుకూరు ఉప విద్యాశాఖ అధికారి నరసింహరావు పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉలవపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అల్లూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు ఆయన సతీమణి సావిత్రిబాయి మహిళా విద్యాబివృద్ధికి చేసిన కృషి మరువలేదని అన్నారు. బండి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, తోట శ్రీహరి, నజీర్‌బాషా, ఇస్మాయిల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుడ్లూరు, (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే నేటి తరానికి ఆదర్శనీయుడని గుడ్లూరు సీఐ మంగారావు అన్నారు. స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో పూలే జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కాకర్ల వెంకటేశ్వర్లు, సీనియర్ జర్నలిస్టు ఉమ్మడిప్రోలు మల్లికార్జునరావు, మహబూబ్ బాషా, ముప్పవరపు కిషోర్, జీ వెంకటేశ్వర్లు, గంగోలు మాల్యాద్రి, తాటిపర్తి రమేష్ పాల్గొన్నారు.

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు కందుకూరులో బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కోవూరు రోడ్డులోని పూలే కాంశ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జొన్నాదుల రాఘవయ్య, గట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాదరావు, జగన్నాధం, మాల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలులోని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎల్. సుధీర్‌బాబు, జిల్లా రైతు నాయ కులు కే.వెంకటేశ్వరరెడ్డి, బీసీ నేత దేవరాళ్ళ తిరుపతి, ఎమ్మార్పీఎస్ నేత పీ.శ్రీనివాసులు, ఏపీ కన్స్యూమర్ సభ్యులు జయా నందం, శివ కోటయ్య, మదన్, టైలర్స్ అసోసి యేష్ సభ్యులు భాషా, శ్రీనివాసులు ఉన్నారు. అలాగే విస్నిబో యిన సుధాకర్ యాదవ్ కార్యాలయంలో జరిగిన వేడుకలో ఇజ్రయెల్, ఏసు రేష్, రవిలు పూలేకు నివాళులర్పించారు. రామిశెట్టి వెంకట సుబ్బారావు ట్రస్ట్ నిర్వాహకురాలు మెతు కురాజేశ్వరి స్వగృహంలో నివాళుల ర్పించారు.


కావలి: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్పీడీవో, సిబ్బంది

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్పీ డీవో కార్యాలయంలో జరిగిన వేడుకలో ఎమ్పీడీవో శ్రీదేవి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బం ది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


కలిగిరి: జ్యోతిబా పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ డీఈవో నరసింహరావు, ఉపాధ్యాయులు


బిట్రగుంట: నివాళుర్పిస్తున్న టీడీపీ నేతలు


కావలి: ఏరియా వైద్యశాలలో రక్తదానం చేస్తున్న బీసీ ఐక్యత భవన్ బాధ్యులు

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి : సీడీపీఓ

వలేటివారిపాలెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శర్మిష్ఠ తెలిపారు. మండలంలోని అత్తింటివారిపాలెం వలేటివారిపాలెంలోని వడ్డెపాలెం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టు నిహారిక, సూపర్‌వైజర్ సునీత, టీచర్లు భారతి, లక్ష్మీ, కార్యకర్తలు రాధ, భారతి, హైమావతి, రమ, ధనలక్ష్మీ, మనోహర, ప్రసన్న, వరలక్ష్మీ, ఆశ తదితరులు పాల్గొన్నారు.


అత్తింటివారిపాలెంలో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సీడీపీఓ శర్మిష్ఠ

జడ్పీ హైస్కూల్లో విద్యార్థులను చేర్పించండి

● గ్రామాల బాట పట్టిన ఉపాధ్యాయులు

లింగసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అన్ని వసతి సౌకర్యాలున్న లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులను చేర్పించాలని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావు కోరారు. క్యాంపెయిన్‌లో భాగంగా ఉపాధ్యాయులు శుక్రవారం మండలంలోని చీమలపెంట, పెంట్రాల, వాకమళ్లవారిపాలెం గ్రామాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా వారు పాఠశాలలో 5వ తరగతి పూర్తిచేసుకోబోతున్న విద్యార్థులను, వారి తలిదండ్రులను కలిసి, తమ హైస్కూల్‌లో 6వ తరగతిలో చేరాలని కోరారు.


విద్యార్థులు, తలిదండ్రులతో మాట్లాడుతున్న హైస్కూల్ హెచ్‌ఎం మాధవరావు, ఉపాధ్యాయులు

గ్రామసభలకు 11 వినతులు

కొండాపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నోషనల్ ఖాతా నెంబర్లు రెగ్యులరైజ్ చేసేందుకు రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న గ్రామసభలకు శుక్రవారం 11వినతులు అందినట్లు తహసీల్దార్ ఎమ్.కోటేశ్వరరావు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జరిగిన గ్రామసభలలో రామానుజపురంలో 3 వినతులు, మర్రిగుంటలో 8 వినతులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి రెగ్యులరైజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు వీఆర్వో కొండయ్య తదితరులు పాల్గొన్నారు.


గానుగపెంటలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు తదితరులు

రోబోటిక్ సర్జరీతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స

కందుకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రోబోటిక్ సర్జరీతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించవచ్చని నెల్లూరు అపోలో ఆసుపత్రి సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ శశిధర్‌రెడ్డి తెలిపారు. కందుకూరులోని డాక్టర్ అజ్మల్ హుస్సేన్ ఆసుపత్రిలో ఆయన ప్రతినెలా రెండో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య సేవలు అందించనున్నారు. ఈసందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రోబోటిక్ సర్జరీ నెల్లూరు అపోలో ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చిందని మోకాలు మార్పిడి అవసరమైన జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవచ్చు న్నారు. ఈ సమావేశంలో డాక్టర్ అజ్మల్ హుస్సేన్, డాక్టర్ ఆసియా బేగం, డాక్టర్ రహీం, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ శశిధర్ రెడ్డి

వాలీబాల్ పోటీలు ప్రారంభం

బిట్రగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి సందర్భంగా విశ్వనాథరావుపేట పంచాయతీలోని రామస్వామిపాలెంలోని జైభీమ్ అంబేడ్కర్ క్రీడా మైదానంలో శుక్రవారం సాయంత్రం వాలీబాల్ పోటీలు ప్రారంభం అయ్యాయి. మూడురోజుల పాటు పోటీలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం రమేష్‌బాబు, జైభీమ్ అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపకులు బత్తుల రవిచంద్రలు మామిడి పులిహోరా, పాయసం, వడపప్పు, పానకం, బతానీలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

అల్లూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీ సమీపంలోని పోలేరమ్మ చెట్టు వద్ద ప్రధాన రహదారిపై ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక సంఘమిత్ర ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పలగాటి శ్రీనివాసులు రెడ్డి ముఖ్యఅతిథిగా చలివేంద్రను ప్రారంభించారు. ముందుగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, డీటీ ప్రవీణ్‌కుమార్, నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు, వెలుగు ఏపీఎం ప్రసాదరావు, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, నాయకులు మేడా కృష్ణారెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, బిట్రగుంట వెంకటేశ్వర్లు రెడ్డి, తోట శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై అపరాధ రుసుము 50 శాతం మాఫీ

కందుకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను ఏకమొత్తంగా చెల్లించే వారికి పన్నుపై అపరాధరుసుము 50 శాతం మిన హాయింపు అవకాశం ప్రభుత్వం కల్పించిందని మున్సిపల్ కార్యాలయం కమిషనర్ శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఖాళీ స్థలం, ఆస్తికి సంబంధించి ఈనెల 30లోపు పన్ను చెల్లించే వారికి వర్తిస్తుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్స రానికి సంబంధించిన పన్ను ఏక మొత్తం గా చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన కోరారు.

● అల్లూరు, (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ ప్రజలు పన్నుల బకాయిలు ఉన్నవారు 50 శాతం వడ్డీ రాయితీతో చెల్లించుకునే అవకాశం ఉందని నగర పంచాయతీ కమిషనర్ ఉమామ హేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు బకాయిలున్న ఇంటి, స్థలాల పన్నులు బకాయిలున్న యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలన్నారు. ఒకేదఫా బకాయి మొ త్తం చెల్లిస్తేనే ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన పన్నుల బకాయిల్లో 5శాతం రాయితీ ఉం టుందన్నారు. రెండూ కలిపి చెల్లిస్తే మొత్తం పై 55 శాతం రాయితీ పొందవచ్చన్నారు.


అయ్యపపడిపూజలో భక్తులు

ఘనంగా అయ్యప్ప జన్మదినం

కలిగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిర్రావారిపాలెం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయంలో అయ్య ప్ప జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రవిస్వామి, గోపికృష్ణ స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు, పడిపూజ నిర్వహించారు. స్థానికులే కాక ఇతర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

పేద మహిళకు కుట్టు మిషన్ అందజేత

కావలి టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్ర జ్యోతి) ఎస్‌కెఆర్ చికెన్ స్టాల్ అధినేత పోలిశెట్టి శ్రీనివాసులు దాతృత్వంతో సంయుక్త సేవా సంస్థ సభ్యులు పట్టణంలోని వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో పేద మహిళలకు కుట్టు మిషన్ వితరణ ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, గౌరవా ధ్యక్షుడు ఖాదర్‌బాషా, రఘు కుమార్ రెడ్డి, ప్రసాదరావు, శివప్రసాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో సమస్యల తిష్ఠ


జంగంరెడ్డిపాలెం అంగన్వాడీ కేంద్రం వద్ద మరమ్మతులకు గురైన మరుగుదొడ్డి

లింగసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన లింగసముద్రం పంచాయతీలోని జంగంరెడ్డిపాలెంలోని అంగన్వాడీ కేంద్రంలో సమస్యలు తిష్ఠ వేశాయి. ఈ కేంద్రం వద్ద సుమారు పదేళ్ల క్రితం చేతిపంపు ఏర్పాటు చేశారు. అయితే వెలుగు కార్యాలయం పైఅంతస్తు నిర్మాణ సమయంలో అప్పటి అధికారులు ఈ చేతిపంపు హెడ్‌ను విడదీసి దానికి మోటారు ఏర్పాటు చేసుకొని నీటిని తోడుకున్నారు. అయితే వారి పని పూర్తయిన తరువాత చేతిపంపు హెడ్‌ను బిగించలేదు. దీంతో తాము మంచినీటికి ఇబ్బందులు పడుతున్నట్లు సిబ్బంది తెలిపారు. గ్రామంలోని మరో బోరునుంచి నీరు తెచ్చుకొని పిల్లలకు భోజనం వండి పెడుతున్నట్లు చెప్పారు. అలాగే ఈ కేంద్రానికి చెందిన మరుగుదొడ్డి షీటును గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టడంతో వాడేందుకు వీలు లేకుండా పోయింది. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


అంగన్వాడీ కేంద్రం వద్ద హెడ్ లేని చేతిపంపు

కేజీబీవీల్లో ప్రవేశాలకు
గడువు పొడిగింపు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీల్లో 11, 12 తరగతుల్లో ప్రవేశా లకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 21వ తేదీ వరకు గడువు పొడగించినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ డి.వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో మాత్రమే చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని కేజీబీవీల్లో లేదా సమగ్ర శిక్ష కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించాలి: ఏఎస్పీ

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం లేకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించాలని అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసు కార్యాలయంలో శోభాయాత్ర నిర్వహణపై హిందూ, ముస్లిం మత పెద్దలతో ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఎవరి మనోభావాలకు ఇబ్బంది కలగకుండా సంయమనం పాటించాలన్నారు. ఈ సమావేశంలో టౌన్, రూరల్ డీఎస్పీలు సింధుప్రియ, శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ శివప్రియలతో పాటు, రెవెన్యూ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సేవలు అమోఘం...

గుర్తింపు ఘనం !

- భూసార పరీక్షా కేంద్రంలో 12 రకాల పరీక్షలు
- రైతులకు కచ్చితమైన ఫలితాలు
- అధికారులు, సిబ్బంది పనితీరుకు జాతీయ గుర్తింపు



ఫ్లేమ్ ఫొటోమీటర్ ద్వారా పొటాష్ స్థాయిని పరీక్షిస్తున్న ఏవో జోత్స్న

సూక్ష్మపోషకాల స్థాయిని అటామిక్ అబ్జార్షన్ స్పెక్ట్రో ఫొటోమీటరుతో పరీక్షిస్తున్న ఏవోలు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మొక్కకు అవసరమైన పోషకాలు అందిస్తూ, దాని పెరుగుదలకు, మంచి దిగుబడిని అందించడంలోనూ మట్టిది కీలకపాత్ర. అయితే పంట దిగుబడులు పెరుగుతాయనే ఆశతో రైతులు మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల మట్టి సమస్యాత్మకంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో మట్టి నమూనాలను సేకరించి 12రకాల భౌతిక, రసాయనిక పరీక్షలు పక్కాగా నిర్వహిస్తున్నారు నెల్లూరులోని భూసార పరీక్ష కేంద్రం వారు. ఈ కేంద్రం జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన ప్రయోగశాలగా ఇటీవల గుర్తింపు పొందింది. ఈనేపథ్యంలో అక్కడ జరుగుతున్న పరీక్షలు, రైతులకు అందిస్తున్న సలహాలను ఆ కేంద్రం ఏడీఏ కే.కన్నయ్య ఆంధ్రజ్యోతికి వివరించారు.

మంచి దిగుబడులే ఉద్దేశం

నేలలో ఏ పోషకాలు తగ్గాయో తెలుసుకుని, ఆయా పోషకాలను మాత్రమే నేలకు అందించడం వల్ల పంటలు బాగా పెరగడంతోపాటు మంచి దిగుబడులు వస్తాయి. ఇవన్నీ తెలియా లంటే భూసార పరీక్షలు తప్పనిసరి. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా మంచి ఆదాయం కూడా పొందవచ్చు. ఈ పరీక్షల ద్వారా మంచి నేలను పొందవచ్చు. భూసార పరీక్షల నిర్ధారణ ద్వారా రైతులకు నత్రజని, భాస్వరం, పొటాష్‌లతోపాటు సూక్ష్మపోషకాలను సిఫార్సు చేస్తారు. అంతేగాక సమస్యాత్మక భూములను గుర్తించి యాజమాన్య పద్ధతులను రైతులకు తెలియజేస్తారు.

సమష్టి కృషికి గుర్తింపు



నెల్లూరు భూసార పరీక్ష కేంద్రానికి జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన ప్రయోగశాలగా గుర్తింపు రావడం సంతోషం. సమష్టి కృషికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నాం. ఇందుకు కేంద్రంలో పనిచేసే అధికారులు, సిబ్బందితోపాటు జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి సహకారం ఎంతో ఉంది.

- కే.కన్నయ్య, భూసార పరీక్ష కేంద్రం ఏడీఏ

వేసవిలో నమూనాల సేకరణ

వేసవిలో పొలాల్లో పంట లేని సమయంలో మట్టి నమూనాలు కేంద్రం నిర్వాహకులు సేకరిస్తారు. ఎరువులు, కంపోస్టు ఇతర పోషక పదార్థాలు వేసిన నేలల్లో 45రోజుల తరువాత 10 నుంచి 12చోట్ల మట్టిని సేకరిస్తారు. వీ ఆకారంలో 15సెం.మీ లోతు గుంతలు తీసి సుమారు అరకిలో మట్టిని తీసుకుంటారు. చెట్లకింద, గట్ల దగ్గర, కంచెలు, కాలిబాటల వద్ద మట్టిని సేకరించకూడదు. చౌడు భూముల్లో విడిగా తీసుకోవాలి. పండ్ల తోటల్లో మాత్రం ఎంపిక చేసిన ప్రదేశంలో ఆరు అడుగుల గుంత తీసి, ప్రతి అడుగుకు పైనుంచి కింది వరకు ఒక మట్టి నమూనా చొప్పున సేకరించాలి.

కేంద్రంలో పరీక్షలు

భూసార పరీక్ష కేంద్రంలో 12రకాల పరీక్షలు నిర్వహిస్తారు. ముఖ్యంగా నేల రంగు, స్వభావం, ఉదజని సూచిక(పీహెచ్), లవణ పరిమాణం(ఈసీ), సేంద్రియ కర్బనం, నత్రజని, భాస్వరం, పొటాష్ స్థాయిలను గుర్తిస్తారు. రైతులు కోరితే సూక్ష్మపోషకాల విశ్లేషణ, లోపాలు, సవరణలు సూచనలు ఇస్తారు. సమస్యాత్మక నేలల్లో జిప్సం, సున్నం పరిమాణాన్ని కూడా తెలియజేస్తారు. అదేవిధంగా బంక మట్టి, ఒండ్రు మట్టి, ఇసుక ఎంతశాతం ఉన్నాయో కూడా పరీక్షించి నేల స్వభావాన్ని నిర్ధారిస్తారు.

గుర్తింపు ఇలా..

ఢిల్లీలోని నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఆఫ్ లేబొరేటరీస్ దేశవ్యాప్తంగా ఏదో ఒక ప్రాంతంలో మట్టినమూనాలు సేకరిస్తుంది. ఇలా సేకరించిన మట్టిని గతేడాది అక్టోబరులో జిల్లా పరీక్ష కేంద్రానికి పంపింది. ఇక్కడి ప్రయోగశాలలో 12 రకాల పరీక్షలు చేసి ఫలితాలను తిరిగి కేంద్ర ప్రయోగశాలకు పంపుతారు. అక్కడ, ఇక్కడ వచ్చిన ఫలితాలు ఒకేలా ఉంటే జాతీయస్థాయి ప్రమాణాలు కలిగిన ప్రయోగశాలను గుర్తింపు ఇస్తారు. ఈ మేరకు ఈ నెల 8వ తేదీన కేంద్రానికి సర్టిఫికెట్ అందింది.

నడికుడి - శ్రీకాళహస్తి రైల్వేలైన్
భూ బాధితులకు న్యాయం చేస్తాం

- నెల్లూరు ఆర్డీవో నాగ సంతోషిణి అనూష



రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డీవో అనూష, తహసీల్దార్ లక్ష్మీ నరసింహం

రాపూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే న్యాయస్థానం ద్వారా పరిష్కరించుకోవాలని నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోషిణి అనూష పేర్కొన్నారు. రాపూరు తహసీల్దార్ కార్యాలయంలో నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు. మండలంలో 548 మంది రైతులు రైల్వే నిర్మాణంలో భూములు కోల్పోతున్నారని వారికి ప్రభుత్వం పట్టా భూములకు రూ. 6లక్షలు, అసైన్మెంట్ భూములకు రూ. 3లక్షలుగా ధర నిర్దేశించిందన్నారు. ఈ ధరల్లో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే న్యాయస్థానం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారానికి రైతులు సానుకూలంగా ఉంటే ఆ రైతుల బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. అనంతరం రైతుల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించి వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి లక్ష్మీనరసింహం, డిప్యూటీ తహసీల్దార్ అశోక్, వీఆర్వోలు, సర్వేయర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో రూ. 77,661 అవినీతి

- రికవరీకి డ్వామా పీడీ ఆదేశం



సామాజిక తనిఖీ బహిరంగ వేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

సంగం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాయంలో శుక్రవారం ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డ్వామా పీడీ గంగా భవాని ఉపాధి పనుల్లో రూ. 77,661ల అవినీతి జరిగిందని గుర్తించి రికవరీకి ఆదేశాంచారు. వివరాల మేరకు మండలంలోని 20 పంచాయతీల్లో సుమారు రూ. 7 కోట్ల విలువైన పనులు జరిగాయి. ఈ పనులపై ఎస్ఆర్పీ ఆధ్వర్యంలో జిల్లా డీఆర్‌పీ సభ్యులు అన్ని గ్రామాల్లో చేసిన పనులపై కూలీలను విచారించి సుమారు రూ. 77,661 అవినీతి జరిగిందని నిర్ధారించారు. ఈమేరకు సంబంధిత క్షేత్రసహాయలు, టీసీల నుంచి రికవరీకి పీడీ గంగా భవాని ఆదేశాంచారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ వెంకట్రామిరెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి రాజ్యలక్ష్మి, ఉపాధి హామి ఏపీడీ శంకరనారాయణ, ఇన్‌చార్జి ఏపీవో సురేష్, టీసీలు, క్షేత్రసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి

బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా



మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న బీసీ సమన్వయ కమిటీ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని కోరుతూ బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీసీ సమన్వయ కమిటీ నెల్లూరు జిల్లా చైర్మన్ బొమ్మి నాగకిషోర్ మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలు ఎంతమంది ఉంటే అంత వాటా ఇవ్వాలన్నారు. బీసీలు ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధించుకోగలమన్నారు. 'మన వాటా మన హక్కు'గా ప్రతి ఒక్కరూ గొంతు కలపాలన్నారు. ఐక్యమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. నెల్లూరులో బీసీ భవన్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ధర్నాకు ముందు మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ కన్వీనర్ బుధవరపు బాలాజీ, బీసీ సంఘ సీనియర్ నాయకులు దేవరాల సుబ్రహ్మణ్యం, బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ భాస్కర్‌గౌడ్, నాయకులు పలమాల శ్రీహరియాదవ్, తాళ్లూరు రాము, కిన్నెర మాలకొండయ్య, నక్క దినేష్, పద్మజాయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వరస్వామి భూముల కౌలు వేలం

- జామాయిల్ సాగుకు అనుమతి ● ఐదేళ్లకు రూ. 20 లక్షల ఆదాయం



దేవుడి మాన్యం భూములకు వేలం నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

ఉలవపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నీలకంఠేశ్వర స్వామికి చెందిన దేవుడి మాన్యం 30 ఎకరాలకు సంబంధించిన కౌలు వేలంపాట శుక్రవారం స్థానిక ఎండోమెంట్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని శానంపూడి గ్రామం సర్వే నెంబరు 519లో నీలకంఠేశ్వరస్వామి దేవస్థానంకు 30.05 ఎకరాల కొండబీడు భూమి ఉంది. ఎండోమెంట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉలవపాడు మండల గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులు 5 సంవత్సరాల వ్యవధికి కౌలు సాగు వేలంపాట నిర్వహించారు. కందుకూరు దేవదాయ ఈవో వీవీ రవీంద్రనాద్ పర్యవేక్షణలో ఈ వేలంపాట జరిగింది. ఇందులో కౌలు దక్కించుకున్న ఉన్నం మధు నుంచి సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.5 లక్షలు, మొదటి సంవత్సరం కౌలు డబ్బులు రూ.4 లక్షలు వసూలు చేసి నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసులు తెలిపారు. ఏడాదికి రూ. 4 లక్షల చొప్పున 5 ఏళ్లకు రూ. 20 లక్షల ఆదాయం దేవస్థానంకు సమకూరినట్లు అయ్యింది. స్థానిక ఎస్సై అంకమ్మ తన సిబ్బందితో వేలం పాట సజావుగా జరిగేలా చూశారు.

మైనింగ్ జరిపితే కేసు నమోదు

దేవస్థానం అధికారులు విధించిన నిబంధనల ప్రకారం నడుచుకోవాలని మెట్ట పంటలను సాగు చేసుకోవాలని, జామాయిల్ సాగుకు అనుమతి ఇస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. ఎత్తుపల్లాల చదును పేరుతో అక్రమంగా గ్రావెల్ మైనింగ్ చేస్తే సంబంధిత కౌలుదారుడిపై కేసు నమోదు చేసి లీజు రద్దు చేస్తామని దేవస్థానం ఈవో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కందుకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని ఓగూరు కోల్డ్ స్టోరేజి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. ఓగూరు గ్రామానికి చెందిన గంగవరపు వెంకటేశ్వరరెడ్డి (72) మోటారుసైకిల్‌పై సింగరాయకొండ వైపు వెళ్తుండగా అదే మార్గంలో పొగాకు బేళ్ల లోడుతో వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొని ముందు ఆగిఉన్న టాటామ్యాజిక్ వాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో వెంకటేశ్వరరెడ్డిపైకి లారీ ముందు టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందగా మ్యాజిక్ వాహనంలో ఉన్న మార్టూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంకటేశ్వరరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కారు దగ్ధం

- తప్పిన పెనుప్రమాదం



తగలబడుతున్న కారును ట్యాంకర్ నీటితో ఆర్పుతున్న ఎస్సై అంకమ్మ, స్థానికులు

ఉలవపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక కారు దగ్ధమైన సంఘటన శుక్రవారం సాయంత్రం ఉలవపాడు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నెల్లూరు నుంచి విజయవాడకు నలుగురు వ్యక్తులు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో ఉలవపాడు సౌత్ బైపాస్ వద్ద ఎంజీ బ్రదర్స్ పెట్రోల్ బంకు దాటిన తరువాత ముందు వెళుతున్న లారీని ఢీకొట్టడంతో అదుపుతప్పిన కారు మార్జిన్ ఫెన్సింగ్ వద్ద ఆగిపోయింది. కారు కిందభాగం పూర్తిగా దెబ్బతిని మంటలు చెలరేగడంతో కారులోని నలుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చూస్తుండగానే మంటలు కారుని చుట్టుముట్టి పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



కళాకారుల నృత్యం





పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు



ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

డిగ్రీ పరీక్షలలో ఇద్దరు డీబార్

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిల శుక్రవారం డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలు జరిగాయి. ఇందులో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి ఆర్. మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 9,450 మంది విద్యార్థుల్లో 8,873 మంది హాజరవగా మిగిలిన 577మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.8962
వెండి కిలో ధర రూ. 95,400
వెండి ఒక గ్రాము రూ.98.40

న్యూస్ బాక్స్

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రాపూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఏపీఎం రాధారెడ్డి తెలిపారు. స్థానిక వెలుగు ప్రాజెక్ట్ కార్యాలయంలో డ్వాక్రా సంఘాలతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడివో భవాని, వ్యవసాయఅధికారి శ్యాంసుందర్‌రాజు, సిసిలు, పొదుపు సంఘాల వివోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోనలో పెంచలోరి వైభవం



హంసపై విహరిస్తున్న పెంచలస్వామి

రాపూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో వసంతోత్సవాలలో భాగంగా శుక్రవారం హంస వాహనంపై స్వామివారు విహరించారు. ఉదయం స్వామికి విశేష పూజలు చేసి రాత్రి హంస వాహనంపై స్వామివారిని ఊరేగించామని ఆలయ ఈవో పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

అన్నదానం, మజ్జిగ పంపిణీ

కొడవలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరకటి మల్లికార్జున జన్మదిన వేడుకలు శుక్రవారం నార్తురాజుపాలెంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా గ్రామ ప్రధాన కూడలిలో ఆయనతో కేక్ కట్ చేయించారు. అనంతరం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రంను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు విల్సన్, బాబీ, సిద్దార్థ్ పాల్గొన్నారు.

నేడు సీతారాముల కళ్యాణం

పొదలకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామాలయంలో శనివారం రాత్రి 7గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఉభయకర్తలు కోనం బ్రహ్మయ్య, హైమావతి, ఊకోటి వెంకటేశ్వర్లు, పద్మావతి, లక్ష్మీనారాయణ, కళాభారతి తెలిపారు. అలాగే ఉదయం స్వామివారి అష్టోత్తరాలు, ప్రత్యేక పూజలు, భక్తులకు వడపప్పు, పానకం ప్రసాద వితరణ, అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ముత్తుకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా కృష్ణపట్నంలో త్వరలో చేపట్టనున్న రీ సర్వేపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు స్వప్న మాట్లాడారు. త్వరలో కృష్ణపట్నంలో ప్రారంభించనున్న రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు కె.శ్రీనివాసులు, మండల డిప్యూటీ సర్వేయర్ అనురూప్, గ్రామ రెవె న్యూ అధికారి ఉమాదేవి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, ఆనందయ్య, వెంకటాద్రి, నాయకులు పాల్గొన్నారు.

చెక్ పవర్ తాత్కాలిక రద్దు

విడవలూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ముదివర్తి సర్పంచు విడవలూరు నిర్మలమ్మ చెక్ పవర్‌ని తాత్కలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టరు ఆదేశాలు జారీ చేసిన విషయం శుక్రవారం మండలంలో వెలుగులోకి వచ్చింది. అయితే ఈ విషయంపై మండల అధికారులు గోప్యత పాటించటంపై అనుమానాలు రేక్కెతిస్తున్నాయి. సర్పంచు నిర్మలమ్మ గ్రామాభివృద్ధి పనులకు అడ్డుపడుతూ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేశారని, చేసిన పనులకు బిల్లుల మీద సంతకాలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు ఇటీవల గ్రామస్థులు జిల్లాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారులు వచ్చిన ఆరోపణలపై సర్పంచు సక్రమంగా వివరణ ఇవ్వక పోవటంతో 6నెలల పాటు చెక్ పవర్‌ని రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని మండల పరిషత్ అధికారులు బయటకి రాకుండా గోప్యంగా ఉంచారు.

శక్తియాప్‌పై అవగాహన

వెంకటాచలం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గొలగమూడి సమీపంలోని టూరిజం కళాశాలలో శుక్రవారం శక్తియాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే గొలగమూడిలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమం వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల రక్షణ కవచం.. శక్తి యాప్ అని, ప్రతి మహిళ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ఆపద సమయంలో పోలీస్ వారి సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో టూరిజం కళాశాల నోడల్ ఆఫీసర్ సంజీవ్‌రెడ్డి, శక్తి టీమ్ ఏఎస్ఐ సుబ్బరాజు, హెచ్‌సీ శామ్యూల్ రంగయ్య ఉన్నారు.

పూలేతోనే బడుగు వర్గాల అభ్యున్నతి

- ఘనంగా జ్యోతిబా పూలే జయంతి
- నేతలు, అధికారుల ఘన నివాళి

పొదలకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు ఊకోటి లక్ష్మీనారాయణ మాట్లాడారు. దళిత, గిరిజన, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడంలో పూలే పాత్ర అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పముజుల శంకరయ్య మాట్లాడారు. పూలే జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసాధికారత దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా వేడుకలు నిర్వహించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండల ఉపాధ్యక్షులు తుమ్మల శ్రీనివాసులు, బీసీ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రాధయ్య, నరసయ్య, బత్తురి మురళీ, విశ్రాంత ఉద్యోగులు పిచ్చయ్య, మస్తానయ్య, పైడాకుల సుధాకర్, కారంపూడి మోహన్, చలపతి పాల్గొన్నారు.



ఐ. పేట: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

- రాపూరు (ఆంధ్రజ్యోతి):మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో భవాని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ మాజీ సర్పంచ్ పచ్చిగళ్ల రత్నం, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, చంద్రమోహన్, శశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- వెంకటాచలం (ఆంధ్రజ్యోతి):కాకుటూరు సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో జరిగిన వేడుకలో పూలే చిత్రపటానికి వర్సిటీ రిజిస్ట్రార్ సునీత పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు చదువులోనే కాకుండా సామాజికబాధ్యతలో కూడా ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజయ, ప్రొఫెసర్లు విజయా నంద్‌కుమార్ బాబు, ఆర్.మధుమతి, అల్లం ఉదయ్ శంకర్, డాక్టర్ సుజయ్‌కుమార్ ఉన్నారు.



వెంకటాచలం: నివాళులర్పిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ సునీత

- ఇందుకూరుపేట,(ఆంధ్రజ్యోతి): పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్ర వారం కస్తూర్బాగాంధీ జయంతిని నిర్వహించారు. ముందుగా కమిటీ సభ్యులు ఎన్.వెంకటేశ్వర ప్రసాద్ కస్తూర్బాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కైలాసం శ్రీనివాస రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, షేక్.అల్లాబక్షు పాల్గొన్నారు.

కాకాణి జైలుకు వెళ్లడం ఖాయం

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
- అట్టహాసంగా సర్వేపల్లి ఏఎంసీ పాలక మండలి అభినందన సభ

వెంకటాచం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎంతలా తప్పించుకుని తిరిగినా దొరికితే జైలుకు వెళ్లడం ఖాయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలంలో శుక్రవారం సాయంత్రం సర్వేపల్లి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) అభినందన సభను అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డితోపాటు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు పాల్గొన్నారు. వీరిని తొలుత సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్ద గజమాలతో సత్కరించి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే ఏఎంసీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి ఏఎంసీ చైర్మన్‌గా గాలి రామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్‌గా అరుణమ్మ, డైరెక్టర్లను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడారు. వైసీపీ హయాంలో చేసిన పాపాలే నేడు కాకాణిని వెంటాడుతున్నాయని చెప్పారు. భయపడేదే లేదని చెప్పావు.. పులి అన్నావు... ఇప్పుడు ఎక్కడికి పారిపోయి దాక్కు న్నావు కాకాణి అని ఎద్దేవా చేశారు. అనంతరం నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాపై 64కేసులు పెట్టారని, రాష్ట్రంలోనే కేసుల్లో నెంబర్ వన్‌గా ఉన్నానని చెప్పారు. పోలీసులపై తాము ఎన్నడూ దుర్భాషలాడలేదని, అక్రమ కేసులపై పోరాటాలు మాత్రమే చేశామన్నారు. పోలీసులపై మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచిదికాదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పగటి కలలు కంటున్నారని, ఈజన్మలో ఇంకా సీఎం కాలేరన్నారు. ఎవరి రుణం తీర్చిన కార్యకర్త, అమ్మ రుణం తీర్చలేమన్నారు. నందమూరి బాలకృష్ణ దగ్గర తనకు ప్రేమ ఉంటే చాలు అన్నారు. కార్యక్రమంలో సర్వేపల్లి కూటమి నేతలు తదితరులున్నారు.



పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే సోమిరెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

తూతూ మంత్రంగా కాలువ ఆక్రమణల పరిశీలన

- రైతులకు సమాచారం ఇవ్వని అధికారులు
- ఇదివరకే ఆక్రమణ జరిగిందంటున్న లష్కరు

విడవలూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని గాదెలదిన్నె పంచాయతీ పరిధిలోని యంత్రకాయ మిట్ట కాలువ ఆక్రమణపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జిల్లాధికారులు స్పందించారు. శుక్రవారం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, మండల ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు నీటిపారుదల ఏఈ సురేష్‌తో కలిసి ఆక్రమిత కాలువను పరిశీలించారు. అయితే ఈ తతంగం లష్కరు కనుసన్నల్లో తూతూ మంత్రంగా జరిగిందని రైతులు ఆరోపించారు. వైసీపీ నాయకులకు అనుకూలంగా ఇదివరకు ఆక్రమణలు జరిగాయని అధికారులను లష్కరు తప్పుదోవ పట్టించాడని విమర్శలు ఉన్నాయి. విచారణకు వచ్చిన ఇరిగేషన్ ఏఈ కాలువ ఎంత విస్తీర్ణం ఉండాలి, ఎంత ఆక్రమణకి గురైందని గ్రామంలోని ఆయకట్టుదారులతో మాట్లాడలేదు. ఇరిగేషన్ అధికారులు విచారణకు వస్తున్నారని అధికార పార్టీ నాయకులకు గాని రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదు. దీంతో యంత్రకాయ మిట్ట కాలువ ఆక్రమణ తొలగింపు ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయంపై ఏఈ సురేష్ మాట్లాడారు. కాలువను పరిశీలించామని, యంత్రకాయ మిట్ట కాలువ పూడికతో నిండిపోయిందని, కాలువ ఎంత విస్తీర్ణం ఉందో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిస్తే దాని ప్రకారం ఆక్రమణలను తొలగిస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

రాపూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ ఉద్యోగులు స్థానిక డిపో వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఎన్‌ఎం యుఏ కార్యదర్శి ఏవి రమణ ఆధ్వర్యంలో ఉద్యోగులు డిపో గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ నాయకులు నసీర్ అహ్మద్, సుధాకర్, హరిబాబు, నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఏఎంసీ వైస్ చైర్మన్‌గా వెంపులూరి అరుణ

పొదలకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా టీడీపీ మహిళా నాయకురాలు వెంపులూరు అరుణ నియమితులయ్యారు. ఆమెతో పాటు పొదలకూరు నుంచి మరో ముగ్గురు టీడీపీ నాయకులు డైరెక్టర్లుగా ఎంపికయ్యారు. వీరిలో అక్కెం సుధాకర్‌రెడ్డి, నిమ్మ వ్యాపారి పోతుగుంట రామలింగయ్యనాయుడు, పిన్నెల్లి ప్రభాకర్‌లు ఉన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ డైరెక్టర్లుగా ఎంపికైన ఈ నలుగురితో శుక్రవారం వెంకటాచలంలో పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఏఎంసీ చైర్మన్ డైరెక్టర్లుగా తమ ఎంపికకు కృషి చేసిన శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ అధిష్టానవర్గానికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

పొదలకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శుక్రవారం జనసేన కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ మండల ఇన్‌చార్జి దాసినేటి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు నూనె మల్లికార్జున్‌యాదవ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్, జనసైనికులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు

కోవూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు అంబేడ్కర్ పూర్ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాట్లను పూర్తి చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని, పార్కుప్రాంతాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు లవకుమార్, ఎన్.శ్రీనివాసులు, జాన్సన్, శ్రీధర్, సింహాద్రి, సుధాకర్, టోని మాట్లాడారు. స్థానిక దళిత కాలనీ ఎదుట 15సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం ఎదుట జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల కులస్థులు, అంబేడ్కర్ అభిమానులందరూ పాల్గొనాలని కోరారు.

స్ట్రెస్ మేనేజ్మెంట్‌పై అవగాహన

వెంకటాచలం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూలో శుక్రవారం స్ట్రెస్ మేనేజ్మెంట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, ప్రముఖ కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ నాగేశ్ బట్లపేనుమర్తి హాజరై విలువైన సూచనలిచ్చారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో మానసిక ఒత్తిడి (స్ట్రెస్) అనేది చాలా మందికి ఎదురయ్యే ప్రధాన సమస్య అన్నారు. ఒత్తిడిని సరైన పద్ధతిలో నియంత్రించకపోతే అది శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ధ్యానం, యోగా, శ్వాస నియంత్రణ, సమయపాలన, నిద్రపట్టే అలవాట్లు, భావోద్వేగ నియంత్రణ వంటివి సాధనతోనే మానసిక ఒత్తిడిని తట్టుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ప్రొఫెసర్లు జీ విజయానంద్‌కుమార్‌బాబు, మధుమతి, ప్రభాకర్, అల్లం ఉదయ్‌శంకర్ ఉన్నారు.



బట్లపేనుమర్తిని సన్మానిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ సునీత, ఇతర ప్రొఫెసర్లు

మద్యం బెల్టు దుకాణాన్ని తొలగించండి

కోవూరు, ఏప్రిల్11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుమ్మళ్ళదిబ్బ కాలనీలో ఏర్పాటు చేసిన బెల్టు దుకాణాన్ని తొలగించాలని శుక్రవారం మహిళలు ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ కాలనీలో మద్యం దుకాణం నిర్వహిస్తున్నందున రాత్రి సమయంలో మద్యం ప్రియుల ఆగడాలు మితిమీరిపోయినట్లు చెప్పారు. వెంటనే మద్యం బెల్టు దుకాణాన్ని మూసి వేసి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు.

మద్యం బెల్టు దుకాణదారుల అరెస్టు

కోవూరు (ఆంధ్రజ్యోతి): పాటూరు, గుమ్మళ్ళదిబ్బ ప్రాంతాల్లోని మద్యం బెల్టు దుకాణాలపై శుక్రవారం ఎక్సైజ్ సీఐ కిశోర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పాటూరు సుజాత, మేనాటి బాలకృష్ణ నుంచి 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటి వరకు బెల్టు షాపులు నిర్వహిస్తున్న 61మందిపై కేసులు నమోదు చేశామన్నారు. 25 మంది పాత నేరస్థుల్ని తహసీల్దారు ఎదుట హాజరుపరచామన్నారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల్లోని గ్రామాల్లో నిరంతరం దాడులు చేసి అనధికారిక మద్యం విక్రయాల్ని అడ్డుకుంటామన్నారు. గంజాయి, నాటుసారా, అనధికార మద్యం విక్రయాలపై తమ ఫోన్ నెంబర్‌కు 94409 02524కు సమచారం ఇవ్వాలన్నారు.



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

వైద్య సేవలతో ప్రజల్లో మమేకం



పెనుబల్లిలో వైద్య విద్యార్థుల ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు చదువుకునే దశలో ప్రజలతో మమేకం అయ్యేందుకు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించే కార్యక్రమం చేపట్టినట్లు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రొఫెసర్ ఖాదర్‌వలి తెలిపారు. శుక్రవారం పెనుబల్లిలో సర్పంచు పెంచలయ్య, ఎంపీటీసీ వినయ్ నారాయణ ఆధ్వర్యంలో వైద్య కళాశాల విద్యార్థులతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి అహ్మద్‌బాబుతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజారోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ ప్రకారం ఎంబీబీఎస్ విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఐదేళ్ల విజిట్ చేసి ప్రజారోగ్య సమస్యలు తెలుసుకుని పరిష్కారం దిశగా పనిచేయాలన్నారు. కార్యక్ర మంలో వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

బుచ్చిలో చలివేంద్రాల ఏర్పాటు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలుగు కార్యాలయంలో వెలుగు పీడీ నాగరాజకుమారి, పార్క్ సెంటర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి వేర్వేరుగా చలివేంద్రాలు ప్రారంభించారు. త్వరలో పట్టణంలో మరో 4చలివేంద్రాలు ప్రారంభించనున్నట్లు చైర్‌పర్సన్ తెలి పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తాళ్ళ వైష్ణవి, శ్రీదేవి, నాగరాజు, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు. అనంతరం వెలుగు కార్యాలయంలో వీఓఏలతో పీడీ నాగరాజకుమారి సమావేశం నిర్వహించారు. మండల సమాఖ్యలో పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి, వెలుగు సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవాలు

ఇందుకూరుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):జగదేవిపేట అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం చిన్నారులు, కిషోర బాలికలు, గర్భవతులు, బాలింతలతో శుక్రవారం సీడీపీఓ ఎం.రాజ్యలక్ష్మీ, డాక్టర్ సి.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోషణ్ పక్వాడా- 2025 కార్యక్రమంతో పిల్లలు, మహిళల్లో ఆరోగ్యకరమైన పోషకాహారాన్ని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యం అన్నా రు. ఐసీడీఎస్ సీడీ పీవో ఎం.రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ మంచి పోషక విలువలున్న ఆహార పదార్థాలు, ఆకు కూరలు, కూరగాయలు తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, ఏఎన్ ఎం శ్రీకల్పవల్లి, హెల్త్ అసిస్టెంట్ మాధవ, ఆశా, అంగ న్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య రంగంలో ఎన్‌హెచ్‌ఎం విప్లవం

- జిల్లాకు ఏటా రూ.25 కోట్ల రాక
- వ్యాధుల నియంత్రణలో ఈ నిధులే కీలకం
- ఆశా కార్యకర్తల నియామకంతో వైద్యసేవలు విస్తృతం

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఓ విప్లవంలా ఉన్న జాతీయ హెల్త్ మిషన్ (ఎన్ఎహెచ్ఎం) పథకం అమలై శనివారంనాటికి 20 ఏళ్లు పూర్తయ్యాయి. 2005 ఏప్రిల్ 12వ తేదీన కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ కార్యక్రమాన్ని మొదట జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్ఆర్‌హెచ్‌ఎం)గా పిలిచేవారు. దీనిని 2013లో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)గా పేరు మార్చిఅమలు చేస్తోంది. దీనిద్వారా అనేక వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి తద్వారా నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో సుఖ ప్రసవాలు నుంచి మాతా, శిశు మరణాల నివారణ వంటి ప్రాధాన్యత రంగాలపై కీలక పాత్ర పోషిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం వైద్య సేవలకు ఎంతో గుర్తింపు వస్తోంది. ఎన్‌హెచ్‌ఎం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలోని ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితో పాటు ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. కేంద్రం తన వాటా కింద 60 శాతం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు విడుదల చేయాల్సి ఉంది.

జిల్లాకు ఏటా రూ.25 కోట్ల

ఎన్‌హెచ్‌ఎం పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం జిల్లాకు ఏటా రూ.25 కోట్లు విడుదల చేస్తుంది. ఈ నిధులతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలతోపాటు వైద్య ఉద్యోగుల జీతభత్యాలు అందిస్తున్నారు. జిల్లాలోని 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఒక్కోదానికి ఏడాదికి రూ.1.75 లక్షల, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలకు రూ.5 లక్షల, 2 ఏరియా ఆసుపత్రులు, ఒక జిల్లా ఆసుపత్రికి రూ.10లక్షల వంతున ఎన్‌హెచ్‌ఎం నిధులు విడుదల చేస్తుంది. దీంతో పాటు 659 సచివాలయాలకు శానిటేషన్ నిధుల కింద రూ. 10వేలు చొప్పున రూ.65.90 లక్షలను కేటాయిస్తుంది. జనారోగ్య సమితి కింద 497 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు రూ.10వేల వంతున రూ.49.70 లక్షల కేటాయిస్తుంది. ఈ నిధులతో ఆయా ఆసుపత్రులలో పలు అభివృద్ధి పనులతోపాటు అత్యవసర మందులు కొనుగోలు చేసే వీలుంటుంది.

2025లో లక్ష్యాలు..

2025లో ఎన్‌హెచ్‌ఎం లక్ష్యాలును నిర్దేశించింది. శిశు, తల్లి మరణాల రేటు తగ్గించాలి. స్త్రీ ఆరోగ్యం, శిశు ఆరోగ్యం, నీరు, పారిశుద్ధ్యం, రోగ నిరోధకాలు, పోషక విలువలు వంటి సేవలు అందించాలి. స్థానికంగా వచ్చే రోగాలతోపాటు అంటువ్యాధుల వ్యాప్తిని నిరోధించాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలను విస్తృత అందించాలి. అలాగే జనాభా నియంత్రణతోపాటు లింగ సమతుల్యత పాటించాలి. ప్రసూతి మరణాలు 113 నుంచి 90కి తగ్గించాలి. శిశు మరణాలను 32 నుంచి 23కు తగ్గించాలి. స్థూల సంతానోత్పత్తి రేటును 2.1 శాతానికి చేరువచేయాలి. జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల సంఖ్యను 10వేల జనాభాలో ఒకరికి మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలి. మలేరియా వ్యాధిని కూడా వేయి మందిలో ఒకరికి మాత్రమే ఉండేలా తగ్గించాలి. అంటు వ్యాధుల కారణంగా మరణాలు లేకుండా చూడాలి.

ఎన్‌హెచ్‌ఎం నుంచి వచ్చే మార్గదర్శకాలే కీలకం

ఎన్‌హెచ్‌ఎం సూచనల మేరకు వైద్య ఆరోగ్య కార్యక్రమాలు అమలు చేస్తున్నాము. ఎన్‌హెచ్‌ఎం అందిస్తున్న నిధులకు అనుగుణంగా వైద్య ఆరోగ్యశాఖలో అనేక సంస్కరణలు తీసుకు వస్తున్నాం. ఎన్‌హెచ్‌ఎం 20 ఏళ్ల పూర్తి చేసుకోవాడం ఆనందంగా ఉంది.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

కావలిలో మరో ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం

- రూ.2కోట్ల వరకు వసూలు చేసిన కలిగిరివాసి
- రీపేమెంట్ ఆగడంతో బాధితుల లబోదిబో
- న్యాయం చేయాలన్నా పట్టించుకోని పోలీసులు

కావలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేసిన షేక్ మహబూబ్ సుభానీ ఉదంతం మరవక ముందే మరో మోసం వెలుగులోకి వచ్చింది. ట్రేడ్ మార్కెటింగ్‌లో పెట్టుబడుల పేరుతో ప్రజల నుంచి నగదు వసూలు చేసి ఓ వ్యక్తి పరారయ్యాడు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించినా వారు పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యేను కలిసే యత్నంలో ఉన్నారు.

కలిగిరి మండలానికి చెందిన ఒక వ్యక్తి కావలి పాతూరు శివాలయం సమీపంలో ఉంటూ నాలుగేళ్లుగా ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో షేర్ మార్కెటింగ్ చేస్తున్నట్లు అందరితో నమ్మబలికాడు. తొలుత రూ.50 వేలు వంతున ప్రజల నుంచి వసూలు చేసి, వారికి నెలకు రూ.7 వేల వరకు చెల్లిస్తూ నమ్మకం ఏర్పరుచుకున్నారు. ఒకరి నుంచి మరొకరికి అలా వ్యాపించి మానస హాల్‌సెంటర్ ప్రాంతవాసుల నుంచే సుమారు రూ.2 కోట్ల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. కొంతకాలం వరకు రూ.లక్షకు రూ.14 వేలు దాకా ఇస్తూ వచ్చిన సదరు వ్యక్తి ఆ తర్వాత మార్కెట్ తగ్గిందని చెప్పి రూ.10 వేలు ఇస్తూ వచ్చారు. దీంతో చిరుద్యోగులు, వ్యాపారులు తమ దగ్గర ఉన్న డబ్బులే కాకుండా బంగారం కుదవపెట్టి మరీ ఇచ్చినట్లు బాధితులు ఆవేదన చెందుతున్నారు. మార్చి నుంచి రీపేమెంట్ చేయకపోగా ఫోన్ ఎత్తకపోవడంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది. ఇంటికి కూడా తాళం వేసి ఉండటంతో ఒకటోపట్టణ స్టేషన్‌కు వెళ్లి తమ గోడు చెప్పుకోగా కోర్టుకువెళ్లి తేల్చుకోండంటూ పోలీసులు ఉచిత సలహా ఇచ్చారని పేర్కొన్నారు. ఆ తర్వాత సదరు వ్యక్తి ఇంటికి వెళ్లగా ఆయన భార్య తమ వద్ద డబ్బుల్లేవటూఊ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని వాపోతున్నారు. దీంతో బాదితులంతా త్వరలో కావలి ఎమ్మెల్యే కృష్ణాఆరెడ్డిని కలిసే ప్రయత్నంలో ఉన్నారు.

కౌన్సిల్, బడ్జెట్ సమావేశాల్లో రూ.7.22 లక్షల భోజనం తిన్నారా!?

- కాంట్రాక్టర్ లెక్కల్లో చేతివాటం ఎంతో!?

నెల్లూరు (సిటీ), ఏప్రిల్ 11, (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజాధనం దోచుకోవడం అధికారులు, నాయకులే కాకుండా కాంట్రాక్టర్లకూ ఆనవాయితీగా మారింది. వారం రోజుల వ్యవధిలో ఇటీవల కౌన్సిల్ సమావేశం, బడ్జెట్ సమావేశాలు జరిగాయి. ఇందులో కార్పొరేటర్లు, అధికారులు, ఇతరులకు భోజనం పెట్టినట్లు ఏకంగా రూ.7.22 లక్షలకు లెక్కగట్టారు. ఈ మొత్తాన్ని డ్రా చేసేందుకు బిల్లులు సిద్ధం చేసి సంబంధిత విభాగాలకు పంపారు. ఇందులో చూపిన లెక్కలు ఔరా.. అనిపిస్తున్నాయి.

మటన్ బిర్యానీ, చికెన్ పీస్, రోటీ, కర్రీ, వైట్‌రైస్, సాంబారు, రసం, పెరుగుతోపాటు ఐస్‌క్రీం, అరటిపండు, కిళ్లీ కలిగిన ప్లేటు భోజనాన్ని క్యాటరింగ్ నిర్వాహకులు రూ.350లకు అందిస్తున్నారు. కానీ ఇదే ప్లేటు భోజనానికి రూ.560 ఖర్చయినట్లు, వెయ్యి మందికి భోజనం పెట్టినట్లు సదరు కాంట్రాక్టరు బిల్లులు సిద్ధం చేశారు. ఈ లెక్కన కౌన్సిల్ సమావేశానికి రూ.2.8 లక్షలు, రెండుసార్లు స్నాక్స్ ఇచ్చినందుకు రూ.81 వేలు ఖర్చయినట్లు చూపారు. ఇదే ఖర్చును బడ్జెట్ సమావేశంలోనూ చూపి మొత్తంగా రూ.7.22 లక్షలు భోజనానికి ఖర్చుపెట్టినట్లు బిల్లులు తయారు చేసి విభాగాలకు పంపారు. 54 మంది కార్పొరేటర్లు వారికి సహాయకులుగా మారో 54 మంది, అధికారులు, ఉద్యోగులు 100 మంది వరకు ఉన్నారు. ఇక మీడియా ప్రతినిధులు 30 మంది ఉన్నారు. ఈ లెక్కన 238 మంది (మొత్తం 476) చొప్పున హాజరైన కౌన్సిల్, బడ్జెట్ సమావేశాలకు వెయ్యి మందికి లెక్కగట్టడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వాస్తవానికి దూరంగా రూపొందించిన బిల్లులను ఏమాత్రం ప్రాథమిక తనిఖీ కూడా చేయని అధికారులు చకచక నిధులు మంజూరు చేసేందుకు సిద్ధమయ్యారు. నేడో, రేపో బిల్లుల సొమ్మును కాంట్రాక్టరు ఖాతాలో జమ చేయనున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	111
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	222

కోడిగుడ్ల ధర (100): 420

ఆ 12 పనులు మొదలు పెట్టాల్సిందే : రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరురూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : తన నియోజకవర్గంలో ఛాలెంజింగా తీసుకున్న 303 అభివృద్ధి పనుల్లో ఇప్పటికీ మొదలు కానీ ఆ 12 పనులు ఎలాగైన మొదలు పెట్టాల్సిందేనని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులకు తెగేసి చెప్పారు. శుక్రవారం నెల్లూరులోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 303 పనుల్లో 291 పనులు కొన్ని పూర్తయి, మరికొన్ని జరుగుతూ, ఇంకొన్ని క్యూరింగ్ దశల్లో ఉన్నట్లు తానే ప్రత్యక్షంగా చూశానన్నారు. 12 పనులు ఇప్పటికీ మొదలు కాలేదని, వాటికి నెలకొన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించి మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. అనుకున్న సమయానికి అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(జడ్పీ), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని బీవీ నగర్, కొండాయపాళెం, పడారుపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం.శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో మాగుంట లేఅవుట్, మినీబైపాస్‌రోడ్డు, లెక్చరర్స్ కాలనీ, కొండాయపాళెం, వనంతోపు, సప్తగిరి కాలనీ, ఆర్‌టీవో ఆఫీస్, పడారుపల్లి, కళ్యాణ్ నగర్, సంఘమిత్ర స్కూల్, నక్కలగుంట పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గాంధీ గిరిజన కాలనీ, వెంకటేశ్వరపురం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. రైతుబజార్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా తడికలబజార్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

● **నెల్లూరు రూరల్..**

నెల్లూరురూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అల్లీపురం ఏఈ శ్రీలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల కోడూరుపాడు, నారాయణరెడ్డిపేట, నవలాకులతోట, కొత్తకాలువ ప్రాంతాల్లోని ఇండస్ట్రియల్ ఏరియా, అల్లీపురం, పెద్దచెరుకూరు, గుడిపల్లిపాడు, చింతారెడ్డిపాళెం, రాజుపాళెం ప్రాంతాలలో నివాసాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి, గురువాయూర్ మహావిష్ణువు ఆలయంలో జన్మనక్షత్రం ఉత్తర నక్షత్రం సందర్భంగా శుక్రవారం అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి విశేష అభిషేకం, విశేష అలంకారం పూజలు జరిగాయి. మహావిష్ణు ఆలయంలో మహాలక్ష్మీ ఉత్తరానక్షత్రం సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకాలు, అలంకారం జరిగింది. రెండు ఆలయాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయం అధ్యక్షుడు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య సదస్సు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని వీఆర్‌సీ వాకర్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వీఆర్‌సీ మైదానంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రభుత్వ డాక్టర్ కె.చంద్రహాస్ వేసవిలో సీనియర్ సిటిజన్స్ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బండారు సుబ్బారెడ్డి, కార్యదర్శి షేక్.రియాజ్ అహ్మద్, కోశాధికారి జీఎస్.ప్రసాద్, మాజీ అధ్యక్షులు నేతాజీ సుబ్బారెడ్డి, డాక్టర్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

దోమల నుంచి రక్షణ పొందాలి



నిల్వ నీటిలో దోమల లార్వాను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 11(ఆంధ్ర జ్యోతి): ప్రజలు దోమల నుంచి రక్షణ పొందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా జిల్లా అదనపు అధికారి నాగార్జునరావు సూచించారు. శుక్రవారం నగరంలోని చంద్రమౌళినగర్, గాంధీనగర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లల్లో నీటి నిల్వఉ, దోమల ఉత్పత్తిపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో నీటి నిల్వల కారణంగా దోమల లార్వా పెరిగి అది విస్తరిస్తుందని పేర్కొన్నారు. తద్వారా దోమలు ప్రబలి ప్రాణాంతక వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వైరల్ జ్వరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త జ్యోతిబాపూలే



జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



జిల్లా ఎస్పీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ సౌజన్య

● ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి, తదితరులు

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబాపూలే గొప్ప సంఘసంస్కర్త అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో ఉన్న పూలే దంపతుల విగ్రహాలకు ఆయన పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ణ, కుల, లింగ వివక్షపై పోరాటం చేపట్టి ప్రజలను చైతన్యవంతం చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు.

● ముదిరాజ్ సంఘ రాష్ట్ర నాయకుడు, కేంద్ర అగ్రికల్చరల్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ కనకట్ల రఘురాం ముదిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు, తదితరులు మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ జ్యోతిబా పూలే అణగారిన వర్గాల విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేశారన్నారు.

పోరాట యోధుడు పూలే : ఏఎస్పీ

నెల్లూరు(వ్యవసాయం): ప్రజల హక్కుల కోసం పోరాడిన పోరాట యోధుడు జ్యోతిబాపూలే అని అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య పేర్కొన్నారు. శుక్రవారం పోలీసు కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● పూలే దంపతుల చిత్రపటాలకు జనసేన నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి అజయ్‌బాబు, డివిజన్ ఇన్‌ఛార్జిలు రాము, నితీష్, భార్గవ్ రాముడు, ఆనందరావు, శ్రీనివాసులు, నగర కార్యదర్శి సుమంత్, బాలు తదితరులు పాల్గొన్నారు.

● జనసేన నాయకులు గునుకుల కిషోర్, జనసేన కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జునయాదవ్‌లు పూలేకి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సుందరరామిరెడ్డి, అనుదీప్‌రెడ్డి, సుధామాధవ్, రాజేష్, పోలయ్యా, పవన్‌యాదవ్, వెంకట్, మహేష్, మనోజ్, నరహరి, శ్రీకాంత్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పూలే జీవితం భావితరాలకు..

నెల్లూరు(విద్య): పూలే జీవితం భావితరాలకు మార్గదర్శకమని సమగ్రశిక్ష ఏపీసీ డీ.వెంకటసుబ్బయ్య అన్నారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని సమగ్రశిక్ష విభాగంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పూలే మార్గంలో నడిచి విద్యాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరిగిన పూలే జయంతి కార్యక్రమంలో 500 మంది బీసీ యువతకు స్వయం ఉపాధి పథకాల కింద రూ.11.4 కోట్ల సబ్సిడీ రుణాల మెగా చెక్కును అందజేస్తున్న మంత్రి ఆనం, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ తదితరులు

● బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దర్గామిట్ట నగరపాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాలలో పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీటీఏ వ్యవస్థాపకుడు నూకలపాటి రమణయ్య మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం పూలే నిరంతరం శ్రమించారని, ఆయన చూపిన మార్గంలో ఎంతో మంది పయనించి మానవ హక్కులను పరిరక్షించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాసా ప్రసాద్, నేతలు పాల్గొన్నారు.

● రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని మహాత్మ గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో జ్యోతిబాపూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల మహిళల్లో విద్యాజ్యోతిని వెలిగించిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఏ జిల్లా అధ్యక్షుడు షేక్.ఖాజారహంతుల్లా, మహిళా కార్యదర్శి చేవూరు ఇందిర, ఉపాధ్యాయులు రావూరి సునీత, కోనేటి రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

● కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

నెల్లూరు(లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జ్యోతిబాపూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉమామహేశ్వర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎస్ఎల్‌వీ వరప్రసాద్, లైబ్రరీ సెక్రటరీ స్వర్ణా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమగ్రశిక్ష కార్యాలయంలో పూలేకు నివాళులర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు

ఉత్కంఠగా టీ-20 క్రికెట్ పోటీలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ల సహకారంతో బుజబుజనెల్లూరులోని సీఏప క్రీడామైదానంలో జరుగుతున్న సింహపురి ప్రీమియర్ లీగ్ టీ-20 క్రికెట్ పోటీలు ఉత్కంఠంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం గ్రౌండ్ ఏలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూర సూపర్‌కింగ్స్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 196 పరుగులు సాధించగా ఆత్మకూరు రేంజర్స్ జట్టు 148 పరుగులు మాత్రమే సాధించడంతో నెల్లూరు విజేతగా నిలిచింది. గ్రౌండ్-బీలో జరిగి మ్యాచ్‌లో సర్వేపల్లి సూపర్‌జైంట్స్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 172 పరుగులు సాధించగా కావలి సన్‌రైజర్స్ జట్టు 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 174 పరుగులతో విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో గూడూరు రాయల్ ఛాలంజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 165 పరుగులు సాధించగా కోవూరు నైట్‌రైడర్స్ 14.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 166 పరుగులతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో సూళ్లూరుపేట స్పార్టెన్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 273 పరుగులు సాధించగా నెల్లూరు రూరల్ కింగ్స్ 19.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 276 పరుగులతో విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లలో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారులకు అనంతపురం క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి ట్రోఫీలు అందజేశారు. పోటీలను టోర్నీ నిర్వాహక కమిటీ ఛైర్మన్ కె.వంశీకుమార్, నవాజ్‌ఖాన్, రాష్ట్ర క్రీడాకారులు టీఈ.శశిధర్, ఏసీఏ అంపైర్లు అప్పలరెడ్డి, కిరణ్, అకులన్నలు పర్యవేక్షించారు.



ట్రోఫీలు అందిస్తున్న మధు ఆచారి

బోన్‌మ్యారో శస్త్ర చికిత్సకు ఆర్థికసాయం



బాధితులకు చెక్కు అందచేస్తున్న వాకాటి

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో తలసీమియా వ్యాధిగ్రస్థుల్లో ఆదర్శ్, ప్రణీత్, రిత్విక్ అనే చిన్నారులకు శస్త్ర చికిత్సకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ.35 లక్షలు వంతున ఆర్థిక సాయం ప్రకటించారు. దీంతో బెంగళూరులోని మహావీర్‌జైన్ హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రెడ్‌క్రాస్ కమిటీ ఛైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కాగా బాధిత చిన్నారులకు ఖర్చుల కోసం మైథిలి స్కూల్ నిర్వాహకులు మైథిలి, ఆమె కుమార్తె శశిప్రియ రెడ్‌క్రాస్ పాలక మండలికి రూ.2.50 లక్షలు అందజేశారు. ఆ చెక్కులను శుక్రవారం వాకాటి విజయకుమార్‌రెడ్డి, తలసీమియా కన్వీనర్ డాక్టర్ సీత, డాక్టర్ రమ్య బాధితులకు అందచేశారు.

బాధితులకు ప్రత్యామ్నాయం చూపండి

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ, డ్రైన్ల నిర్మాణం పేరిట 25 ఏళ్లగా నివాసం ఉంటున్న వారి ఇల్లు తొలగించారని, బాధితులకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేస్తూ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆ పార్టీ నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కొండా ప్రసాద్‌లు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దళిత కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఇటీవల అయ్యప్పగుడి వద్ద నున్న ఉడ్‌కంప్లెక్స్‌లో రోడ్ల విస్తరణ పేరిట ఇల్లు తీసేశారన్నారు. రెక్కాడితేకానీ డొక్కాడని వారు వీధిన పడ్డాయని చెప్పారు. అనంతరం వారికి న్యాయం చేయాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. నాయకులు కత్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, పెంచల నరసయ్య, మాలకొండయ్యలు పాల్గొన్నారు.

ఎన్‌వైకే, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్ర, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. వీఆర్‌సీ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి కూరగాలయ మార్కెట్ వరకు అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్టర్ డాక్టర్ సునీత, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర నేషనల్ యూత్ వలంటీర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో విలీనమైన ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఏపీపీటీడీ ఎన్ఎంయుఏ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఉద్యోగ భద్రత అమలు చేయాలని, ఆర్టీసీలో పాత పద్ధతి వైద్య విధానం అమలు చేయాలని, పదోన్నతులు వెంటనే ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ శెలవులు ఇవ్వాలని కోరారు. రాత్రి అలవెన్సులు రూ.150 నుంచి రూ.400 పెంచాలని, గ్యారేజీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మెడికల్ లీవులో ఉన్న సమయంలో ప్రతినెలా జీతాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి.మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

వేణుగోపాలుడికి హనుమంత సేవ



వెండి హనుమంత సేవలో వేణుగోపాలస్వామి

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అభిషేకాలు, విశేష అలంకారం, పూజలు జరిగాయి. ఉదయం చప్పరంపై స్వామివారికి గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. సాయంత్రం పూలంగిసేవ, విశేష పూజలు జరిగాయి. రాత్రి స్వామివారికి వెండి హనుమంతసేవ, నగరోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ఛైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

గజవాహనంపై కోదండరాముడు

బాలాజీనగర్ సీతారామమందిరంలో శుక్రవారం ఉదయం అభిషేకాలు, విశేష అలంకారం పూజలు జరిగాయి. సాయంత్రం విశేష పూజలు, పూలంగిసేవ జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాత్రి స్వామివార్లకు గజవాహనంపై నగరోత్సవం జరిగింది. ఈ ఉత్సవాలను ఉత్సవ కమిటీ ఛైర్మన్ అమరా మోహన్‌రావు, అధ్యక్షుడు తన్నీరు మస్తాన్‌రావు, కార్యదర్శి సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కొప్పవరపు శివప్రసాద్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కోదండరాముడుకి హనుమంత సేవ

నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమంత సేవ, నగరోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకం, విశేష పూజలు, అనంతరం పల్లకీసేవ కనుల పండువగా జరిగాయి. సాయంత్రం పూలంగి సేవ జరిగింది. ఈ కార్యక్రమాలను ఈవో జి.దర్గయ్య, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

● సంతపేట ఆంజనేయస్వామి ఆలయంలో 7వ రోజు శుక్రవారం బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, సాయంత్రం సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గజవాహనంలో పేట ఉత్సవం నిర్వహించారు. ఇంటింటా భక్తులు కర్పూర హారతులు పట్టారు. ఈ కార్యక్రమాలను ఈవో రఘురామయ్య పర్యవేక్షించారు.

● త్యాగరాజస్వామి నగర్‌లోని సీతారామచంద్రస్వామి మందిరంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉదయం తిరుమంజనం కనుల పండువగా జరిగింది. విశేష అలంకారం, పూజలు, సాయంత్రం పూలంగిసేవ జరిగాయి. అనంతరం వయ్యారనడకలచే స్వామికి పల్లకీసేవ, ఏకాంతసేవ అలంకారం పూజలు కనుల పండువగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వై.నాగదేవీప్రసాద్, ఆలయ ధర్మకర్త యనమంద్ర చైతన్యకుమార్, వైష్ణవి, మందిరం నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఉద్వాపన పూజ



రాజరాజేశ్వరి ఆలయంలో పల్లకీసేవ

నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో రాహుకాల ఉద్వాపన పూజలు శుక్రవారం వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాహుకాల దీపాలు వెలిగించి 18 వారాలు పూర్తి చేసుకని 19వ వారం 42 మంది భక్తులు రాహుకాల ఉద్యాపన పూజ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి 108 నిమ్మకాయల మాల, చీర జాకెట్టు, పసుపు కుంకుమ సమర్పించారు. సాయంత్రం 6గంటలకు వేద పారాయణం, సంధ్యా మేళం, కుంభహారతులు జరిగాయి. రాత్రి పల్లకీసేవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏసీ కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా పంగునోత్తర కల్యాణం



స్వామి వారికి కల్యాణం జరుపుతున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో శుక్ర వారం రాత్రి పంగున్నోత్తర కల్యాణం వైభవంగా జరిగింది. రంగనాయకమ్మ (తాయార్లు) జన్మనక్షత్రం ఉత్తరా నక్షత్రం సందర్భంగా ఉదయం శ్రీదేవి భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామికి, రంగనాయకమ్మ (తాయార్లు)కు తిరుమంజనం సేవ, పుష్పాలంకారం పూజలు జరిగాయి. సాయంత్రం వేద పండితులు స్థల పురాణం ప్రవచనం చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత రంగనాయకస్వామికి, రంగనాయకమ్మ (తాయార్లు)కు ఎదురుకోలు ఉత్సవం నయనానందకరంగా జరిగింది. అనంతరం వేద ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిగింది. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈ ఉత్సవాల్లో ఆలయ ఛైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పార్కిన్‌సన్స్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

● అపోలో వైద్య నిపుణులు వైద్యులు శ్రీరామ్‌సతీష్, బిందుమీనన్

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పార్కిన్‌సన్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అపోలో ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్, న్యూరో ఫిజీషియన్ విభాగాధిపతి డాక్టర్ బిందుమీన్ వెల్లడించారు. శుక్రవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్కిన్‌సన్స్ వ్యాధి వల్ల రోగులతో పాటు కుటుంబ సభ్యులు కూడా భావోద్వేగానికి గురవుతారని, సామాజిక సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. వారిపట్ల జాగ్రత్త వహించాలన్నారు. ప్రారంభంలోనే వ్యాధిని గుర్తిస్తే మందుల ద్వారా వ్యాధిని నియంత్రించ వచ్చని, వ్యాధి తీవ్రమైతే శస్త్ర చికిత్స ద్వారా నయం చేయవచ్చని వెల్లడించారు. ఇంకా ఈ వ్యాధిపై పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి హెడ్ బాలరాజు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని కోలార్‌లోని బెంగళూరు నార్త్ యూనివర్శిటీలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు జరగనున్న ఆలిండియా పెన్‌కాక్ సిలాట్ ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 12 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. నగరంలోని కళాశాలలో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో త్వరలో జరగనున్న పెన్‌కాక్ సిలాట్‌లో కూడా ప్రతిభ చూపాలని తెలిపారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో కన్వీనర్ టీపీ.వరప్రసాద్, ఏజీఎం టీవీ.శ్రీధర్, హెచ్‌వోడీలు డాక్టర్ కె.మురళీ, యు.సుబ్రహ్మణ్యం, పీడీలు డీ.ప్రసాద్, డీ.అనూరాధ, సిబ్బంది పాల్గొన్నారు.



94906 17873

ప్రజలకు మరింత చేరువగా పోలీసు వాట్సాప్ సేవలు

జిల్లా పోలీసు శాఖ వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనికోసం ప్రత్యేకంగా 94906 17873నెంబరును కేటాయించింది. జిల్లా.. సబ్‌డివిజన్ల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేస్తోంది. ఎక్కడ, ఎలాంటి నేర ఘటనలు జరిగినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగినా ఆయా గ్రూపుల్లో పోస్ట్ చేస్తే చాలు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగుతారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

● ప్రాథమికంగా జిల్లా స్థాయిలో 172, సబ్ డివిజన్ స్థాయిలో 354 గ్రూపులు ఏర్పాటు

● 6 నెలల్లో 2 లక్షల మందిని చేర్చేలా చర్యలు

వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారు. అదే ఆలోచనతో ఎస్పీ హర్షవర్ధన రాజు పోలీసు శాఖలోనూ వాట్సాప్ సేవలు ప్రారంభించారు. జిల్లాలోని మారుమూల పల్లెల నుంచి పట్టణాల వరకు పోలీసు వాట్సాప్ ద్వారా శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయనున్నారు. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి తద్వారా పోలీసులకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా, ఎక్కడ నేరాలు జరిగినా, దోపిడీలు, దొంగతనాలు, సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు, చైన్ స్నాచింగ్‌లు, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక పరమైన నేరాలు, భూ ఆక్రమణలు, దందాలు.. ఇలా ఏ సమస్య వచ్చినా వెంటనే పోలీసులకు తెలిపి సమస్య పరిష్కారానికి కృషి చేయడానికి వాట్సాప్ సేవలు ఉపయోగపడతాయి. స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ స్థాయి, జిల్లా స్థాయిలో అన్ని వర్గాల ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, కవులు, రచయితలు, సీనియర్ సిటిజన్లు, మీడియా ప్రతినిధులు, ఆటో, లారీ, కారు, బస్సు డ్రైవర్ల యూనియన్లు, చాంబర్ ఆఫ్ కామర్స్, ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగులు ఇలా అన్ని రకాల వర్గాలను గ్రూపుల్లో చేర్చనున్నారు. వారి నుంచి అవసరమైన సమాచారం రాబట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే సబ్ డివిజన్ స్థాయిలో 354 వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి వాటి ద్వారా దాదాపు 54,210 మంది సభ్యులను చేర్చారు. ఎస్పీ నేతృత్వంలోని జిల్లా స్థాయి గ్రూపులో 172 వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి వాటి ద్వారా దాదాపు 25,000 మందిని చేర్చారు. రానున్న ఆరు నెలల కాలంలో రెండు లక్షల మందిని సభ్యులుగా చేర్చేదిశగా చర్యలు చేపట్టారు. వాట్సాప్ గ్రూపులపై సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించడానికి త్వరలో పట్టణాలు, పల్లెలు, నగరాల్లోని సర్కిళ్ళు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్ళు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు వద్ద ఫ్లెక్సీలు, బ్యారికేడ్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ హర్షవర్ధన రాజు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఎక్కడైనా ఎలాంటి ఘటన జరిగినా సంబంధిత పోలీసులు ఆయా గ్రూపుల్లో ఫొటోలు, నేరాలు జరిగిన తీరుపై సమాచారం అందులో పోస్టు చేస్తారు. తద్వారా మళ్ళీ అలాంటి ఘటనలు జరగకుండా ప్రజలు, వ్యాపారులు, వర్తక వాణిజ్య సంస్థల ప్రతినిధులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి అవకాశాలు వుంటాయని ఎస్పీ ఆశాభావం వ్యక్తం చేశారు.



జిల్లావ్యాప్తంగా శని, ఆదివారాల్లో భానుడి భగభగలు జనాన్ని ఠారెత్తించనున్నాయి. శుక్రవారం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు దారుణంగా అనిపించినప్పటికీ వాతావరణ శాఖ విడుదల చేసిన జాబితా ప్రకారం ఏ మండలంలోనూ ఎండ వేడిమి 40 డిగ్రీలకు చేరలేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● నేడు మూడు చోట్ల 41 డిగ్రీలు దాటనున్న ఉష్ణోగ్రతలు.. మరో 14 మండలాల్లో 40కిపైగా

● రేపు ఎనిమిది మండలాల్లో అదే పరిస్థితి

నేడు: జిల్లాలోని మొత్తం 34 మండలాలకు గానూ సగం అంటే 17 మండలాల్లో పగటి ఉష్ణోగ్రతలు శనివారం 40 డిగ్రీలు దాటనున్నాయి. ముఖ్యంగా గూడూరు, బాలాయపల్లి, ఓజిలి మండలాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉండనుంది. గూడూరులో 41.3 డిగ్రీలు, బాలాయపల్లి, ఓజిలి మండలాల్లో 41 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలాగే దొరవారిసత్రం, నాయుడుపేట, పెల్లకూరు మండలాల్లో 40.9 డిగ్రీలు వంతున, చిట్టమూరు, సూళ్లూరుపేట మండలాల్లో 40.7 డిగ్రీలు, బీఎన్ కండ్రిగ, చిల్లకూరు, తొట్టంబేడు మండలాల్లో 40.6 డిగ్రీలు, డక్కిలి, వరదయ్యపాలెం, వెంకటగిరి మండలాల్లో 40.5 డిగ్రీలు, సత్యవేడులో 40.3, శ్రీకాళహస్తి, వాకాడు మండలాల్లో 40.1 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదవుతాయని సంబంధిత శాఖ అంచనా వేసింది.

రేపు: జిల్లాలో ఆదివారం కూడా ఎనిమిది మండలాల్లో వేసవి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. మండలాల వారీగా చూస్తే.. గూడూరులో 40.8 డిగ్రీలు, బాలాయపల్లిలో 40.7, ఓజిలి, డక్కిలి మండలాల్లో 40.4 డిగ్రీలు, వెంకటగిరిలో 40.3, తొట్టంబబేడు, పెళ్ళకూరు మండలాల్లో 40.2 డిగ్రీలు, నాయుడుపేటలో 40 డిగ్రీలు వంతున పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడించింది. నడి వేసవి మొదలు కావడంతో పగటి ఉష్ణోగ్రతలు, ఉక్కపోత, వడగాడ్పులు వంటివి పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజానీకం ముందు జాగ్రత్త పాటించాల్సిన అవసరముంది.

బంగారు రథంపై
మెరిసిన మలయప్ప



వసంత మండపంలో హారతులు

వార్షిక వసంతోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం ఉదయం బంగారు రథంపై దేవేరులతో కలిసి మలయప్ప ఊరేగారు. ఉదయం 8 నుంచి రెండు గంటల పాటు సాగిన స్వర్ణరథోత్సవంలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వసంత మండపంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో ఉత్సవర్లను అభిషేకించారు. చివరిరోజు శనివారం శ్రీభూదేవి సమేత మలయప్పస్వామితో పాటు రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి, శ్రీసీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవర్లకూ స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు 'ఇంటర్' ఫలితాలు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదలకానున్నాయి. జిల్లాలో 32,213 మంది ప్రథమ.. 30,548 మంది ద్వితీయ.. మొత్తం 62,761 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. వీరంతా ఫలితాల కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

వాట్సప్ గవర్నెన్స్‌లోనూ చూసుకోవచ్చు

ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఎస్ఎంఎస్‌లతో పాటు ఈ ఏడాది ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన వాట్సప్ గవర్నెన్స్‌లోనూ ఇంటర్ ఫలితాలు తెలుసుకోవచ్చు.'మనమిత్ర' నెంబరు 95523 00009కి ఏజీ అని మెసేజ్ పంపించి తద్వారా వచ్చే సేవల్లో విద్యను ఎంచుకోవాలి. తన హాల్‌టికెట్ నంబరును విద్యార్థి సెండ్ చేస్తే ఫలితాలను పీడీఎఫ్ రూపంలో పొందొచ్చు.

నేడు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వర్కింగ్ డే

తిరుపతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెండవ శనివారమైన 12వ తేదీ జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్స్‌కు సంబంధించిన అన్ని రకాల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు 14 నుంచి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఈ నెల 14వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చెన్నయ్య తెలిపారు. మండల, మున్సిపల్, జిల్లా కమిటీ స్థాయిలో నిబంధనలు, లక్ష్యం మేరకు ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.

శ్రీసిటీ పరిధిలో ఆస్తిపన్నుపై
పంచాయతీలకు 50 శాతం వాటా

● 15 గ్రామ పంచాయతీలకు తీపి కబురు

తిరుపతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలి పరిధిలోని 15 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. శ్రీసిటీ పరిధిలో ఇకనుంచి చేపట్టే ఆస్తిపన్ను వసూళ్లలో 50 శాతం వాటా సంబంధిత పంచాయతీలకు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2004-09 నడుమ అప్పటి చిత్తూరు జిల్లాకు చెందిన సత్యవేడు, వరదయ్యపాలెం, నెల్లూరు జిల్లాకు చెందిన తడ మండలాల పరిధిలో శ్రీసిటీ ఏర్పాటైన సంగతి తెలిసిందే. సత్యవేడు మండలానికి చెందిన ఏడు, వరదయ్యపాలెం మండలానికి చెందిన ఆరు, తడ మండలానికి చెందిన రెండు చొప్పున మొత్తం 15 పంచాయతీల పరిధిలో శ్రీసిటీకి భూములు కేటాయించారు. ఆ గ్రామాలు, భూములకు సంబంధించిన రికార్డులు ఇతర అంశాల నియంత్రణ అధికారాలను 2009 ఫిబ్రవరి 21న రాష్ట్ర ప్రభుత్వం ఆయా పంచాయతీల నుంచి తొలగించి శ్రీసిటీ ఐలాకు అప్పగించింది. ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీగా పిలిచే ఈ విభాగం ఏపీఐఐసీ పరిధిలో ఉండి సంబంధిత పంచాయతీల విధులు, బాధ్యతలు, అధికారాలు చెలాయిస్తుంది. ఆ సందర్భంగా శ్రీసిటీ పరిధిలో ఐలా వసూలు చేసే ఆస్తి పన్నులో పంచాయతీలకు ఎంత వాటా చెల్లించాలనే విషయాన్ని ప్రస్తావించలేదు. దీనిపై పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. శ్రీసిటీ పరిధిలో ఐలా వసూలు చేసే ఆస్తి పన్నులో 65 శాతం వాటా ఐలాకు, మిగిలిన 35 శాతం ఆయా పంచాయతీలకు కేటాయించాలని ఆ లేఖలో ప్రభుత్వాన్ని కోరారు. తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరి 17న పంచాయతీరాజ్ కమిషనర్ ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. శ్రీసిటీ పరిధిలోని గ్రామ పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి, అభివృద్ధి కోసం ఆస్తి పన్నులో 50 శాతం వాటా కేటాయించాలని అభ్యర్థించారు. ఈ అంశాన్ని పరిశీలించిన ప్రభుత్వం శ్రీసిటీ ఐలా వసూలు చేసే ఆస్తిపన్నులో 50 శాతం ఐలాకు, 50 శాతం పంచాయతీలకు వాటాలుగా నిర్ణయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకనుంచీ శ్రీసిటీ పరిధిలోని 15 పంచాయతీలకు ఆర్థికంగా గణనీయమైన లబ్ధి చేకూరనుంది. శ్రీసిటీ పరిధిలోని తడ, సత్యవేడు, వరదయ్యపాలెం మండలాలు మూడు ఇపుడు తిరుపతి జిల్లాలో కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

లబ్ధి కలిగే పంచాయతీలు

సత్యవేడు మండలం: ఇరుగుళం, చెరివి, చిగురుపాలెం, ఆరూరు, అప్పాయపాలెం, మల్లావారిపాలెం ఈస్ట్, మాదనపాలెం

వరదయ్యపాలెం మండలం: చిలమత్తూరు, తొండూరు సొసైటీ, మత్తేరిమిట్ట, బత్తలవల్లం, అగ్రహారం, మోపూరుపల్లి

తడ మండలం: తడ, పూడి

ఇసుక అక్రమ రవాణా
మళ్లీ మొదలు

పిచ్చాటూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం అరుణానది పరివాహక ప్రాంతాల్లో వారం రోజులుగా సద్దుమణిగిన ఇసుక అక్రమ రవాణా మళ్లీ మొదలైంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు చొరవతో ఇసుక తరలిస్తున్న రహదారులకు కందకాలు తవ్వించడం.. వాటిని ధ్వంసం చేయడంతో కొంత కాలం అక్రమ రవాణా ఆగింది. మామూలుగా అడవికొడియంబేడు నుంచి తరలించే ఇసుకను.. ఈ సారి రూటు మార్చి పులియకుండ్రం నుంచి తరలించడం ప్రారంభించారు. దీంతో కొందరు రైతులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా, వారిపై ఇసుక మాఫియా దాడులకు పూనుకోవడంతో, వారు భయపడి వదిలేశారు. పగటిపూట ఉచిత ఇసుక సాకుతో ట్రాక్టర్ల ద్వారా తరలించి అడవిశంకరాపురం వెళ్లే మార్గంలో డంపు చేస్తున్నారు. ఆ ఇసుకను రాత్రి వేళల్లో భారీ వాహనాల ద్వారా తమిళనాడు తరలిస్తున్నారు. గతంలో ప్రధాన రహదారుల గుండా పోవడంతో అధికారులు, గ్రామస్తులు అడ్డుకుంటారని భయం ఉండేది. ఇప్పుడు తచ్చూరు-చిత్తూరు సిక్స్‌లేన్ జాతీయ రహదారిపైకి ఎక్కేస్తే ఎదురేలేదు. ఇసుక కోసం 30 అడుగుల మేర తవ్వుతుండటంతో నది పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బ తినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ వీరు ఖాతరు చేయడం లేదు.

అడవి శంకరాపురం మార్గంలో డంపు చేసి ఉన్న ఇసుక



నడక దారిలో
భారీ కొండచిలువ



అలిపిరి కాలినడకదారిలో కొండచిలువ పట్టుబడింది. ఏడోమైలు వద్ద రోడ్డుపైకి శుక్రవారం తెల్లవారుజామున 14 అడుగుల పొడవైన కొండచిలువ వచ్చింది. దీంతో వాహనదారులు, కాలినడక భక్తులందరూ హడలిపోయారు. సుమారు 15 నిమిషాల పాటు వాహనాలు కూడా నిలిచిపోయాయి. పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారం ఇవ్వడంతో, ఆయన అక్కడికి చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. అనంతరం పామును అవ్వాచారి కోన లోయలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

15నుంచి చేపల వేట బంద్

కోట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపలు, రొయ్యలు గుడ్లు పెట్టడం, సంతానోత్పత్తి దృష్ట్యా ఈనెల 15నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపట వేటను నిషేధిస్తున్నట్లు మత్స్యశాఖ ఎఫ్‌డీవో రెడ్యా నాయక్ తెలిపారు. సముద్ర జలాల్లోకి మెకనైజ్డ్, మోటరు బోట్లు వెళ్లరాదని, నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధించడమే కాకుండా ప్రభుత్వం డీజిల్ రాయితీని నిలిపివేస్తుందన్నారు.



రఘురామకృష్ణరాజు, గురజాల జగన్మోహన్



ద్వారక తిరుమలరావు



రాణీ కుముదిని, నీలం సాహ్నీ



జస్టిస్ సంతోష్‌రెడ్డి

శ్రీవారిసేవలో ప్రముఖులు

ఏపీ శాసనసభ డిప్యూటీస్పీకర్ రఘురామకృష్ణ రాజు శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా అభిషేక సేవలో పాల్గొని శ్రీవారి దర్శనం చేసుకున్నారు. తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంతోష్‌రెడ్డి ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇంకా ఏపీ, తెలంగాణ ఎలక్షన్ కమిషనర్లు నీలం సాహ్నీ, రాణీ కుముదిని, బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఆర్టీసీ ఎండీ ద్వారకతిరుమలరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, తెలంగాణ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కూడా శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులూ, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులూ వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం : రూ.3.94 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 57,462

తలనీలాలు సమర్పించినవారు : 22,998





షాపులో పల్లింటి చంద్రశేఖర్

ఆత్మవిశ్వాసమే పెట్టుబడిగా..

వైకల్యాన్ని కాదని స్వావలంబన

మరో ముగ్గురు మహిళలకూ ఉపాధి

పుత్తూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వైకల్యానికి కుంగిపోలేదు. ఆత్మన్యూనతతో వెనుకంజ వేయలేదు. చేయూత కోసం ఎదురుచూడలేదు. ఆత్మవిశ్వాసాన్ని కూడకట్టుకున్నాడు. అదే పెట్టుబడిగా ముందడుగు వేశాడు. మరో ముగ్గురికి ఉపాధి చూపే స్థాయికి ఎదిగాడు. స్వయంకృషికి చిరునామాగా నిలిచాడు. అతడే పుత్తూరుకు చెందిన పల్లింటి చంద్రశేఖర్. పుట్టుకతోనే పోలియోబారిన పడ్డాడు. రెండు కాళ్లూ సరిగా పనిచేయవు.అడుగులు వేయడం కష్టమైనా చిన్నప్పుడు స్కూలుకు వెళ్లేవాడు. పరిస్థితుల ప్రభావంతో ప్రాథమిక విద్యతో ఆపేయాల్సి వచ్చింది. తండ్రికి కొద్దిపాటి వ్యవసాయముంది. అతనికి చేదోడువాదోడుగా నిలిచాడు. వయసు మీరుతున్న తండ్రికి భారం కాకూడదని భావించాడు. స్వయం ఉపాధితో స్వావలంబన సాధించాలని సంకల్పించాడు. ఈక్రమంలో కొన్నాళ్ల క్రితం ఇడ్లీ పిండి మిషన్‌ను ప్రారంభించాడు. తల్లిదండ్రులు తోడుగా నిలిచారు. తర్వాత మరో అడుగేసి గోధుమలు, రాగులు, బియ్యం, మిరపకాయల పిండి మిషన్లతో వ్యాపారాన్ని విస్తరించాడు. పదుగురి ఆరోగ్యానికీ మేలు చేయాలని వేరుశనగ, నువ్వుల మర గానుగలను, నూనె ఫిల్టర్లను ప్రారంభించాడు. స్వచ్ఛమైన గానుగ నూనెలూ, కల్తీ లేని పిండిలు దొరికే ప్రాంతంగా పుత్తూరులో చంద్రశేఖర్ ప్రజల విశ్వాసాన్ని పొందగలిగాడు. ముఖ్యంగా గానుగ నూనెను జనం ఆదరించారు. అంతేకాదు గోధుమ, రాగి, శనగ, జొన్న, సజ్జ, ధనియాలు, మిరప, పసుపులాంటివీ విక్రయిస్తున్నాడు. ఇటీవల తండ్రి చనిపోయాడు. వృద్ధురాలైన తల్లిని పోషిస్తున్నాడు. ఇప్పుడు ఇతడితో పాటు మరో ముగ్గురు మహిళలు పనిచేస్తున్నారు. సమయపాలన, క్రమశిక్షణలను పాటించే అరవయ్యేళ్ల చంద్రశేఖర్ తన కాళ్లమీద తాను నిలబడి మరోముగ్గురికి ఉపాధినిస్తున్న తీరు స్ఫూర్తిదాయకమనడం నిస్సందేహం.

మహిళా విద్యకోసం జ్యోతిరావు పూలే కృషి



కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళల విద్య కోసం జ్యోతిరావు పూలే ఎనలేని కృషి చేశారని జేసీ శుభం బన్సల్ అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బాలాజీకాలనీలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ స్త్రీలకు విద్య అవసరాన్ని గుర్తించి ఆ దిశగా జ్యోతిరావు పూలే కృషి చేశారన్నారు. సామాజిక సంస్కరణలకు నాంది పలికారన్నారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ సదాశివం మాట్లాడుతూ జ్యోతిరావ్‌పూలే చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. అనంతరం వివిధ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు రూ.14.31కోట్ల రుణాల మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు మదనమోహన్, చంద్రన్న, చెన్నారెడ్డి పాల్గొన్నారు.



తుంబుర తీర్థానికి వెళ్లే దారిలో సేద తీరుతున్న భక్తులు

తుంబుర తీర్థానికి తరలిన భక్తులు

తిరుమల, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): తిరుమల తుంబురతీర్థానికి శుక్రవారం భక్తులు తరలివెళ్లారు. ఏటా శ్రీవారి ఆలయానికి ఏడున్నర మైళ్ల దూరం వెలసిన తుంబురతీర్థ ముక్కోటిని నిర్వహించడం ఆనవాయితీ. నిజానికి శనివారం తుంబుర తీర్థ ముక్కోటి అయినప్పటికీ, ఆ ఘడియలు ముందుగా ప్రారంభం కావడంతో శుక్రవారం కూడా భక్తులను తీర్థానికి అనుమతించారు. తిరుపతి, తిరుమల స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులూ తీర్థానికి వెళ్లి స్నానాలు ఆచరించి, తుంబురనాథుడికి పూజలు నిర్వహించారు. భక్తుల కోసం పాపవినాశనం వద్ద అన్నప్రసాదాలు, తాగునీరు, భద్రతను టీటీడీ ఏర్పాటు చేసింది. శనివారం ఉదయం 5 నుంచి 10 గంటల వరకు భక్తులను తీర్థానికి అనుమతించనున్నారు.

నేడు సీపీటీ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి జరగనున్న ఏపీపీఎస్సీ కంప్యూటర్ - కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్టు(సీపీటీ)కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. పుత్తూరులోని వెంకటేశ పెరుమాల్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో శని, ఆదివారాలు రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. 600 మంది హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసరావు, రామాజీ పాల్గొన్నారు.

కడప మార్గం మూసివేత

● భాకరాపేట వైపు వాహనాల దారి మళ్లింపు



కొత్త చెక్‌పోస్ట్ కూడలిలో బ్యారికేడ్లు పెట్టిన పోలీసులు

రేణిగుంట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణ మహోత్సవం నేపథ్యంలో రేణిగుంట, కరకంబాడి నుంచి కడప వైపు వెళ్లే రోడ్డు మార్గాన్ని శుక్రవారం సాయంత్రం పోలీసులు మూసివేసి వాహనాలను దారి మళ్లించారు. ఒంటిమిట్ట ఆలయం ప్రధాన రహదారి పక్కనే ఉండటం.. సీఎం చంద్రబాబు హాజరవుతుండటం.. అధిక సంఖ్యలో విచ్చేసే భక్తులకు ఇబ్బంది లేకుండా ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు భారీ వాహనాలను ఆపేశారు. రేణిగుంట కొత్త చెక్ పోస్ట్, కరకంబాడి కట్ట పుట్టాలమ్మ ఆలయ సమీపంలో రేణిగుంట, గాజులమండ్యం, తిరుపతి ట్రాఫిక్ పోలీసులు రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి భారీ వాహనాలను భాకరాపేట వైపు దారి మళ్లించారు. శనివారం ఉదయం 9 గంటలకు కడప మార్గాన్ని తెరవనున్నారు.

20లోగా టీడీఆర్ బాండ్లు గిఫ్ట్ డీడ్ దశకు రావాలి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనరు మౌర్య

తిరుపతి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): అన్ని టీడీఆర్ బాండ్లు ఈ నెల 20వ తేదీ లోపు గిఫ్ట్ డీడ్ దశకు రావాలని, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు. టీడీఆర్ బాండ్ల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, నమోదు తదితర అంశాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. టీడీఆర్ బాండ్ల మేళాను శుక్రవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఆన్‌లైన్ అయ్యాయి? ఎవరెవరి దరఖాస్తులు ఏ దశలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల నమోదు ప్రక్రియ ఆలస్యమవుతోందన్నారు. ఆయా మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించిన అధికారులు ప్రజలకు ఫోను చేసి వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. సెలవు రోజుల్లోనూ ఆన్‌లైన్ చేయించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డీసీపీ. మహాపాత్ర, ఏసీపీలు బాలాజీ, మూర్తి, టీపీబీవోలు, రోడ్డు ఇంచార్జులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

హలో.. జంప్ చేస్తా





తిరుపతి నగరం లీలామహల్ కూడలిలోని గరుడ వారధి తొలి అంతస్తు సైడ్‌వాల్‌పై శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి కూర్చొని జంప్ చేస్తానంటూ హల్‌చల్ చేశాడు. వద్దంటూ జనం కేకలు వేశారు. పోలీసులకు సమాచారమిచ్చారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

భక్తులు మెచ్చేలా ఈశ్వరయ్యస్వామి తిరునాళ్ల

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవుని వెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి తిరునాళ్లను భక్తులు మెచ్చేలా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఈనెల 13నుంచి 16వ తేదీ వరకు ఈశ్వరయ్యస్వామి తిరునాళ్ల జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎమ్మెల్యే అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తిరునాళ్లను విజయవంతం చేయడానికి చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండటంతో ఆలయం వద్ద మజ్జిగ, మంచినీటి చలివేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యే వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు ఓఆర్ఎస్‌ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ అధికారులు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. తిరునాళ్లకు లక్షకు పైగా భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని, ఎక్కడా తొక్కిసలాట జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్యూలైన్లలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేయాలని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం జరగకుండా అదనంగా 12 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ ఏఈ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, వెంకటగిరి సీఐ రమణ, డక్కిలి తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, ఐసీడీఎస్ అధికారిణి సంషాద్‌బేగం, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి, వెంకటగిరి మండలాల టీడీపీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పప్పు చంద్రమౌళిరెడ్డి, ఎంపీపీ గోను రాజశేఖర్, ఉపాధ్యక్షులు గడ్డం చంద్రశేఖరరెడ్డి, రంగినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉపాధి కల్పనే లక్ష్యం: సునీల్‌కుమార్



నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్, నిరుద్యోగులు, కూటమి నేతలు

చిల్లకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తమ్మినపట్నం పంచాయతీలోని జిందాల్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ నిరుద్యోగులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి పరిశ్రమ సమీపంలో శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు అదృష్టమని, ఎన్ని పరిశ్రమలు వస్తే ఎక్కువ మంది స్థానికులకు ఉద్యోగాలు వస్తాయని ఆశతో ఉన్నామన్నారు. అయితే జిందాల్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదన్నారు. స్థానికంగా ఉన్న యువత ఎంబీఏ, ఎంఏ, బీటెక్ వంటి ఉన్నత చదువులు చదువుకుని పరిశ్రమ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత మంది స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చారో.. పరిశ్రమ ప్రతినిధులు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు స్థానికంగా ఉన్న పేదలు భూములు ఇస్తే స్థానికేతరులకు ఉపాధి కల్పిస్తున్నారని, ఈ విధానం సరికాదన్నారు. జిందాల్ పరిశ్రమలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించకపోవడంతోనే శాంతియుత నిరసన చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా సీఎస్ఆర్ నిధుల ద్వారా గ్రామాల అభివృద్ధి జరగడంలేదని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలో స్థానికులతో సంప్రదించి పనులు చేపడితే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురెడ్డి, కిషోర్ నాయుడు, మస్తాన్ నాయుడు, చిరంజీవి, శివకుమార్, అబ్దుల్‌రహీం, పట్టాభిరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లురాజు, శ్రావణి, లీలావతి, శ్రీదేవి, సుప్రజ, శైలజ, శంకయ్య, సతీష్‌యాదవ్, చంద్రనీల్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కుమార్ యాదవ్, త్రివిక్రమ్‌భూపతి, నయూం తదితరులు పాల్గొన్నారు.

ఎడగారు సాగుకు రైతులు సన్నద్ధం



చిల్లకూరులో వరి నాట్లకు సిద్ధం చేసిన పొలాలు

పెళ్లకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో సాగునీటి వసతి ఉన్న స్వర్ణముఖినది పరివాహక ప్రాంతాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఇప్పటికే నార్లు పోసేందుకు ఎంటీయూ 1010 రకం వరి విత్తనాలను కొనుగోలు చేసుకుని దుక్కులు చేసుకుంటూ సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. పుల్లూరు, పసుపుకండ్రిగ, చింతపూడి, యాలకారికండ్రిగ, లక్ష్మీనాయుడుకండ్రిగ, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు, యడపూడి. చిల్లకూరు, జీపాటూరు, పెళ్లకూరు, కొత్తూరు, రావులపాడు తదితర గ్రామాల్లోని రైతులు నారుమడులు సిద్ధం చేయడంతో పాటు దుక్కులు చేసుకుంటున్నారు. ప్రభుత్వం తెలుగుగంగ నీటిని స్వర్ణముఖినదికి విడుదల చేయడంతో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో స్వర్ణముఖినది పరివాహక ప్రాంతాల్లో రైతులు నార్లు సిద్ధం చేసుకొని పొలాలకు నీరు నింపుతూ సాగుకు సమాయత్తమవుతుండగా, మిగిలిన ప్రాంతాల్లో బోరు బావులపై ఆధారపడిన రైతులు ఇప్పుడిప్పుడే సాగు పనులు చేపట్టారు. సుమారు 3వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారని, సకాలంలో వర్షాలు కురిస్తే సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

స్విమ్స్‌లో మూతపడ్డ 'జనఔషధి'

● రాయితీతో మందుల దొరక్క రోగుల అవస్థలు



తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): 'ప్రధానమంత్రి భారతీయ జనఔషధి కేంద్రం' పేరిట గతంలో స్విమ్స్‌లోని ఓపీ విభాగం లోపల ఏర్పాటు చేసిన జనరిక్ మందుల దుకాణం వారం కిందట మూతపడింది. గడువులోగా పునరుద్ధరణకు చర్యలు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈ దుకాణంలో 50-70 శాతం రాయితీతో జనరిక్ మందులను ఇస్తారు. వాటిని ఎలా వాడాలి? వాటి ఉపయోగాల గురించి చెప్పేందుకు ప్రత్యేకంగా ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. బయట మార్కెట్ ధరల కంటే అతి తక్కువ ధరల్లో మందులు లభ్యమవుతుండటంతో దూర ప్రాంతాల రోగులు నెలకు సరిపడా మందులను కొనుగోలు చేసి వెళ్లేవారు. ఈ దుకాణంలో రోజుకు రెండు వేల మందికిపైగా రోగులు మందులు కొనేవారు. రోజుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు విక్రయాలు జరిగేవి. గతంలో స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్లో స్విమ్స్‌లోని జనరిక్ మందుల దుకాణం గురించి ప్రశంసించారు కూడా. ఈ దుకాణం గడువు ముగిసిందంటూ వారం కిందట మూత పడింది. దీంతో రాయితీ మందులు దొరక్క రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గడువు ముగియకముందే కొనసాగింపు ప్రక్రియ చేపట్టి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ప్రధానమంత్రి భారతీయ జనఔషధి కేంద్రం పేరుతో జనరిక్ మందుల దుకాణాలు కొనసాగుతున్నా కేవలం స్విమ్స్‌లోనే మూతపడింది.

సంస్కృత భాష సంరక్షణకు కృషి

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సంస్కృత భాష సంరక్షణకు, సనాతన ధర్మ పరిరక్షణకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశేష కృషి చేస్తోందని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గురుకుల విశ్వనాథ ధ్యాన మందిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా శివ లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గురుకుల పద్ధతిలో అధ్యయన-అధ్యాపనం, శాస్త్ర పరిరక్షణకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. వైవిధ్యమైన పాఠ్యాంశాలను విశ్వవిద్యాలయం ద్వారా విద్యార్థులకు అందించడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అకడమిక్ డీన్ రజనీకాంత్ శుక్లా, రిజిస్ట్రార్ కె.వెంకట నారాయణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న కంచి కామకోటి పీఠాధిపతి

సమస్యలు వెంటనే పరిష్కరించాలి



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎన్ఎంయూఏ డిపో సెక్రటరీ కేవీ. రత్నం అన్నారు. శుక్రవారం ఎన్ఎంయూఏ డిపో వైస్ ప్రెసిడెంట్ కేఆర్ బాబు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ.రత్నం మాట్లాడుతూ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ నిలుపుదల చేసి అన్ని కేటగిరీల్లో పదోన్నతులు ఇవ్వాలని, నైట్ అలవెన్స్ రూ.150 నుంచి రూ.400 పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సతీస్, రజాక్, భాషా, సుబ్బారావు, భాస్కర్, విజయకుమార్, శ్రీహరి, లక్ష్మణ్, రాజా, నాగేంద్ర, కృష్ణ, విక్రం తదితరులు పాల్గొన్నారు.

అత్తివరంలో ఇరువర్గాల ఘర్షణ

ఎనిమిది మందికి గాయాలు

ఓజిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం అత్తివరంలో ఇరు వర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన 8 మంది గాయపడ్డారు. మండలంలోని అత్తివరానికి చెందిన ఎల్లు గురుమూర్తి అదే గ్రామంలో ఉన్న కర్మాగారానికి అమరేంద్ర వర్గానికి చెందిన ఓ వ్యక్తి ట్యాంకరు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాడు. ఎల్లు గురుమూర్తి వర్గానికి చెందిన వారు ప్రశ్నించి అడ్డుకున్నారు. ఇరువర్గాలకు చెందిన సుమారు 25మంది ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన 8 మంది గాయపడ్డారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇదే ఘటనలో కుంపటి మహేంద్ర ఇచ్చిన కుల దూషణ ఫిర్యాదుపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వప్న తెలిపారు.

రేపు కంటి వైద్య శిబిరం

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో స్థానిక కుమ్మరిమిట్ట సాయిబాబ ఆశ్రమం వద్ద ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ సుధాకరరావు తెలిపారు. శిబిరానికి వచ్చేవారు ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు. వివరాలకు 9704466171, 9440738466 నంబర్లను సంప్రదించాలని కోరారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బనిగీ సాహెబ్‌పేట ప్రాంతంలో శుక్రవారం లారీ ఢీకొనడంతో ఓ మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక బనిగీసాహెబ్‌పేటలో నివాసముంటున్న పర్వీన్ స్థానికంగా ఉన్న సెంటర్‌కు వెళుతుండగా నెల్లూరు నుంచి వెంకటగిరి వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో పర్వీన్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. ఎస్ఐ తిరపతయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పేదలకు విద్య, వైద్యం అందించేందుకు కృషి



పాఠశాలను ప్రారంభిస్తున్న శ్రీనివాసులునాయుడు, ఉపాధ్యాయులు

చిల్లకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పేదలకు విద్య, వైద్యం అందించేందుకే రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేయడం జరిగిందని ఆ ట్రస్టు ఫౌండర్ రాజనేని శ్రీనివాసులునాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని పారిచెర్లవారి పాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ట్రస్టు ఆధ్వర్యంలో రూ.85 వేలతో ఆధునికీకరించిన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో రఫూఫ్ మాటాడుతూ దాతలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి రాజనేని రామయ్యానాయుడు, హెచ్ఎం చంద్రశేఖర్, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, రామచంద్రారెడ్డి, సురేంద్ర, బాబు, భాస్కర్, మంజుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన దీనజన బాంధవుడు, సమసమాజ స్థాపనలో భావితరాలకు నిత్య స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావ్ పూలే అని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, రఫీ, మైలారి రాజశేఖర్, చంద్రారెడ్డి, బాబు, ధనుంజయ, సుధీర్, చేవూరు చెంగయ్య, సుబ్బారావు, నారాయణ, రవి, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని బీసీ బాలుర గురుకులం, బీజేపీ కార్యాలయంలో పూలే జయంతి నిర్వహించారు. గురుకులంలో పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ నారాయణరావు, బహుజన ఐక్యవేదిక నాయకులు మాధవ్, మల్లి, హేమంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా బీజేపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు సురేష్, పనబాక కోటేశ్వరరావు, సారంగం రమేష్‌బాబు నివాళులర్పించారు.

నాయుడుపేట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న జ్యోతిరావ్ పూలే దంపతుల విగ్రహాలకు సీమాంధ్ర బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జూలపాటి మస్తాన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీన్, నాయుడుపేట బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆశ చెంచుకృష్ణయ్య, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, కొప్పాల సుబ్రహ్మణ్యం, బీటీపీ నాయకులు బందిల మోహన్, పేర్నాటి రామకృష్ణ, కోటేశ్వరావు, వెంకటరావ్ నివాళులర్పించారు.

ఓజిలి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీడీవో విజయలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు.

13న బలిజ వివాహ పరిచయ వేదిక

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పద్మావతి వివాహ పరిచయ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన బలిజ వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు రాయల బలిజ సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. గాంధీరోడ్డులోని ఏజీకే బిల్డింగ్‌లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ వేదికకు హాజరై బలిజ కులస్తులు తమ పిల్లలకు చక్కటి తోడును ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌ను 9866355781లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పరిధిలోని అట్టకానితిప్ప, మంగానెల్లూరు, దేగవారికండ్రిగ, మన్నారుపోలూరు సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు మోహిని, పూర్ణిమ తెలిపారు. అదే విధంగా సూళ్లూరుపేట పట్టణంలోని మన్నెముత్తేరి సబ్‌స్టేషన్ పరిధిలోని షార్ ఉద్యోగుల కాలనీ డీఆర్‌డీఎల్, డీవోఎస్ కాలనీలు, కసారెడ్డిపాలెం, దేగలపాలెం, చెంగాళమ్మ సబ్ స్టేషన్ పరిధిలోని బజారు వీధులు, జీఎన్‌టీ రోడ్డు సాయినగర్, పరమేశ్వరినగర్‌లో కూడా విద్యుత్ సరఫరాకు ఉండదని, నియోగదారులు సహకరించాలని కోరారు.

దొరవారిసత్రం: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా దొరవారిసత్రం మండలంలో శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ జగదీష్ తెలిపారు.

తడ: మండలంలోని సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మురళి తెలిపారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

పెళ్లకూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపాడులో టీడీపీ కార్యకర్తలకు సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు కేవీ నాయుడు సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు.

చెలరేగిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు

పట్టించుకోని అధికారులు ● విద్యుత్ సరఫరా అందక రైతుల అవస్థలు




చిల్లకూరు సమీపంలోని జగనన్న కాలనీలో గురువారం రాత్రి దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

గూడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గూడూరు, చిల్లకూరు మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు చెలరేగిపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం చేసి అందులోని రాగి వైరు, విద్యుత్ తీగలను అపహరించుకుని వెళుతున్నారు. రోజురోజుకూ చోరీలు పెరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. గత ఆరు నెలలుగా గూడూరు, చిల్లకూరు మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు అధికమయ్యాయి. ఇటీవల గూడూరు మండలంలోని విందూరు, నెర్నూరు, చెన్నూరు సమీపంలోని కటాలమ్మ గుడి ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. తాజాగా గురువారం రాత్రి చిల్లకూరు సమీపంలో తీపనూరుకు వెళ్లే మార్గంలో జగనన్న కాలనీ వద్ద ఉన్న రెండు ట్రాన్స్‌పార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి వైరు అపహరించుకుని వెళ్లారు. గత ఆరు నెలలుగా ఏదో ఒక చోట తరచూ ఇదే తరహాలో చోరీలు జరుగుతున్నా వీటిని నియంత్రించేందుకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చోరీకి గురైన ట్రాన్స్‌పార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలను సాగు చేసుకునేందుకు రైతులు ఆహర్నిశలు శ్రమిస్తుంటే ట్రాన్స్‌పార్మర్ల చోరీతో విద్యుత్ సరఫరా ఆగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ట్రాన్స్‌కో అధికారులకు చెప్పినా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. ఇకనైనా స్పందించి ట్రాన్స్‌పార్మర్ల చోరీలను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దుస్థితిలో సంపద తయారీ కేంద్రాలు



పైకప్పు శిథిలమైపోవడంతో పిల్లర్లు మాత్రమే ఉన్న ఓజిలిలోని సంపద తయారీ కేంద్రం

ఓజిలి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కోసం ఏర్పాటైన కేంద్రాలు దుస్థితిలో ఉన్నాయి. స్థానిక సంస్థల నిర్వహణ వైఫల్యం, గత ప్రభుత్వ ఉదాసీనతతో కోట్లాది రూపాయల నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారింది. ఓజిలిలో రూ.3.5 లక్షలతో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రం పూర్తిగా రూపుకోల్పోయింది. తాటాకు షెడ్డుగా నిర్మించిన ఈ కేంద్రం నేడు శిథిలమైపోయి పిల్లర్లు మిగిలాయి. గత టీడీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థలు ఆర్థికంగా స్వయం సంవృద్ధి సాధించేందుకు చెత్త నుంచి సంపద తయారీకి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఓజిలి మండలంలోని 26 పంచాయతీల్లోని 17 పంచాయతీల్లో చెత్తనుంచి సంపద కేంద్రాల నిర్మాణం పూర్తి చేశారు. మరో 7 పంచాయతీల్లో వివిధ దశల్లో ఆగిపోయాయి. తిరుమలపూడి, గ్రద్దగుంట పంచాయతీల్లో నిర్మాణమే చేట్టలేదు. గత వైసీపీ ప్రభుత్వం సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోలేదు. గ్రామాల్లో చెత్త సేకరణ కోసం నియమించిన గ్రీన్ అంబాసిడర్లను సైతం నిర్లక్ష్యం చేసింది. అసలు పంచాయతీలకు నిధులే ఇవ్వకపోవడంతో ఎంతో ఉన్నతాశయంతో ప్రారంభమైన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యుద్ధప్రాతిపదికన చెత్త సంపద కేంద్రాలను పునరుద్ధరిస్తున్నారు. అయితే ఓజిలి మండలంలో మాత్రం ఆదిశగా ప్రయత్నాలు చేయడంలేదు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి

కోట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పలు విభాగాల్లో ప్రతిభా పాఠశాలు చూపిన విద్యార్థులను డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి మెమెంటోలతో, శాలువాలలో శుక్రవారం సత్కరించారు. ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన టెక్నోఫెస్ట్ సదస్సులో కోడింగ్, డీబంగింగ్‌లో మొదటి స్థానం సాధించిన విద్యార్థులతో పాటు రాజంపేటలోని అన్నమాచార్య యూనివర్సిటీలో నిర్వహించిన ఏ టుడే జాతీయస్థాయి టెక్నోఫెస్ట్‌లో బహుమతి సాధించిన విద్యార్థులను డైరెక్టర్‌తో పాటు ఆయా విభాగాల అధ్యపకులు అభినందించారు.

ఇసుక రీచ్‌లో తనిఖీలు



ఇసుక రీచ్‌ను తనిఖీ చేస్తున్న మైనింగ్ అధికారులు

కోట, ఏప్రిల్ 11: (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడలి స్వర్ణముఖి నదిలో ఉన్న ఇసుక రీచ్‌ను మైనింగ్ ఏడీ శ్రీనివాసరావు, సహాయ జియాలజిస్టు సుబ్బరాయుడు సిబ్బందితో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. రీచ్‌లో తవ్వకాలు, ఇసుక రవాణా, నిల్వలను పరిశీలించారు. అదేవిధంగా డంపింగ్ యార్డుకు తరలుతున్న ఇసుకను పరిశీలించి రీచ్ యాజమాన్యానికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

నంది వాహనంపై సంగమేశ్వరుడు

కోట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడలిలో వెలసిన కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారు నంది వాహనంపై ఊరేగారు. మేళ తాళాల మధ్య సంగమేశ్వరుడు గూడలి పురవీధుల్లో ఊరేగుతుండగా భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సం నిర్వహించారు.

చేబ్రోలు కిరణ్‌పై చర్యలు తీసుకోండి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ కుటుంబంపై అనభ్యకర వ్యాఖ్యలు చేసిన చేబ్రోలలు కిరణ్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సర్వేలన్నీ సకాలంలో పూర్తవ్వాలి

తడ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సూచించిన సర్వేలన్నీ సకాలంలో పూర్తవ్వాలని ఎంపీడీవో విజయ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న టీజీఆర్ఎస్, వర్క్‌ఫ్రమ్ హోం, హౌస్‌హోల్డ్, ఆధార్, నాన్‌రెసిడెన్సీ, ఈకేవైసీ వంటి సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు బాబు, గాబ్రియేల్, మస్తాన్, పద్మా, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయ్‌కుమార్

రామాలయంలో శ్రీరామనవమి మహోత్సవాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఉభయదాతలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురంలో వెలసిన లక్ష్మణ సమేత సీతారామాంజనేయ ఆలయంలో శ్రీరామనవమి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామివార్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పోట్లపూడి రాజేష్, రాజ్యలక్ష్మి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు గోపి, మునిమోహన్, సాయిరామ్ కిషోర్, జనార్దన యాదవ్, అంకయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మారంగంలో మంచి అవకాశాలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మాల కొండయ్య, కళాశాల కార్యదర్శి శ్రీనివాసబాబా, ప్రిన్సిపాల్ పవన్

సూళ్లూరుపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఫార్మాఫెస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చీరాల ఎమ్మెల్యే ముద్దులూరి మాల కొండయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫార్మారంగంలో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కళాశాల కార్యదర్శి శ్రీనివాస బాబా మాట్లాడుతూ ఫార్మాఫెస్ట్ అవశ్యకతను వివరించారు. కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ సాధించడంలో పాత్ర పోషించిన బృందాన్ని అభినందించారు. విశ్వ విద్యాలయ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 27 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలగాని పవన్ కుమార్, అకాడమిక్ అడ్వజన్ పీవీ రమేష్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, ఏవో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

తాడిమేడులో పోషణ్ పక్వాడ

చిట్టమూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాడిమేడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమ శుక్రవారం నిర్వహించారు. బిడ్డ పెరుగుదల, పర్యవేక్షణపై ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి నారాయణమ్మ వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కల్లూరు ఇంద్రజ, ఏఎన్ఎం సునీత, ఆశ వర్కర్ విజయమణి పాల్గొన్నారు.

వైభవోపేతంగా శ్రీరాముడి హనుమంతసేవ



హనుమంతవాహనంపై శ్రీరామచంద్రుడు

గూడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి విశ్వక్సేనా ప్రార్థన, బలిహరణ, తిరిచ్చి ఉత్సవం, రామతారక హోమం జరిపారు. రాత్రికి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హనుమంత వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయదాతలుగా నాగవెంకట శివకుమార్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

మొక్కుబడిగా మండల సమావేశం

హాజరుకాని అధికారులకు నోటీసులు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్

కోట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కోట ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా ఎంపీడీవో గోపి సభలో చర్చించాల్సిన విషయాలను ప్రస్తావించారు. అయితే కొన్నిశాఖల అధికారులు హజరు కాకపోవడం, వారి సహాయకులు సమాధానం చెప్పడంతో ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. అదేవిధంగా పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు హజరు కాలేదు. దీంతో ఎంపీడీవో కొన్నిశాఖల అధికారులను పిలిపించి వార్షిక ప్రణాళికలను వివరించారు. సమావేశానికి హజరుకాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ కోటయ్య, వైస్ఎంపీపీ వేమారెడ్డి సౌజన్యరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు అజ్మతుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఆంక్షలతో అభివృద్ధికి నోచుకోని రోడ్డు



కలుజుమిట్ట గిరిజన కాలనీ గ్రావెల్ రోడ్డు

దొరవారిసత్రం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలంలోని నేలపట్టు - కలుజుమిట్ట గిరిజన కాలనీ దారి అభివృద్ధికి అటవీశాఖ ఆంక్షలు అడ్డంకిగా మారాయి. నెల్లూరుపల్లి ఆర్అండ్‌బీ రోడ్డుకు లింకు రోడ్డుగా కలుజుమిట్ట గిరిజన కాలనీకి అడవి మార్గంలో దారి ఉంది. 1.5 కి.మీ మేర ఉన్న ఈ దారిని తారురోడ్డుగా మార్చేందుకు గతంలో పలు పర్యాయాలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే అటవీశాఖ అధికారుల అభ్యంతరాలతో పనులు చేపట్టలేదు. అంతేకాకుండా గ్రావెల్ రోడ్డు కావడంతో స్థానికంగా మట్టితీసి పోయడానికి అంగీకరించకపోవడంతో దారంతా గోతుల మయంగా మారింది. కనీసం ఆటో వెళ్లడానికి కూడా ఇబ్బందిగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవతీసుకుని నేలపట్టు - కలుజుమిట్ట గిరిజన కాలనీ దారిని తారురోడ్డుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలు

దొరవారిసత్రం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం వేణుంబాకం క్రాస్ రోడ్డు ఎదురుగా జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ గాయపడ్డారు. దొరవారిసత్రం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆయన నాయుడుపేట నుంచి మోటరు సైకిల్‌పై విధులకు వెళుతుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. సత్యనారాయణకు రక్తగాయాలవడంతో 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో ఆదిశంకర కళాశాల సిబ్బంది

గూడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆదిశంకర కళాశాల ప్రిన్సిపాల్ వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం కళాశాలలో ప్రాజెక్టు మోడల్ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతికత, సృజనాత్మక శక్తిని పెంపొందించి నూతన ఆవిష్కరణలు చేపట్టేలా ప్రోత్సహించేందుకు మోడల్ ఎగ్జిబిషన్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ తరహా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మేధాశక్తి, నూతన ఆలోచన విధానాలను పెంపొందించేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకులు నందకుమార్, మస్తాన్‌వలి, కోఆర్డినేటర్ ఇమ్మానియేల్, ప్రొఫెసర్ ధనుంజయ, డాక్టర్ రాజయ్య, అమరేంద్ర, సురేష్, శ్రీనాథ్‌శర్మ, ఏవో రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

గూడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర నిషేధిత వస్తువుల అక్రమ రవాణాకు ఆటో డ్రైవర్లు సహకారం అందించకూడదన్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. నిషేధిత వస్తువుల రవాణా గురించి ఏదైనా సమాచారం అందితే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రమణయ్య, మున్నా, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.